




Published From Hyderabad, Mahabubnagar and Kadapa

# వార్తాతరంగాలు

జాతీయ దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :151 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శనివారం 10 అక్టోబర్ 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంపై

# సీఎం రేవంత్ యాక్షన్ ప్లాన్..

### 12న మంత్రులతో కీలక భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 9 :** ఎల్‌నినో పరిస్థితులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్? పెట్టారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సీఎం అక్టోబర్ 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు, అధికారులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ఈ సమావేశంలో సీఎం




రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశం ఉంది.

## ఫలితాలు వచ్చినప్పుడే

# ప్రజాస్వామ్యం ఉన్నట్టా...

**ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి**

**రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ**

**ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటు**




కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

## తెలంగాణలో రెవెన్యూ

# అధికారుల బదిలీలు..

**జీవో 630 విడుదల చేసిన సర్కార్**

**హైదరాబాద్, అక్టోబరు 9 :** తెలంగాణలో రెవెన్యూ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బదిలీ చేస్తూ జీవో నంబర్- 630ను తెలంగాణ సర్కార్ విడుదల చేసింది. బి. రాజాగౌడ్ జగిత్యాల అదనపు కలెక్టర్ (ఎల్బీ) నుంచి నిజామాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేసింది. ఎన్. ప్రసూనాంబ జగిత్యాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించింది. డి. వెంకట మాధవరావు నిర్మల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించింది. పి. రామ్‌రెడ్డి వనపర్తి జిల్లా రెవెన్యూ అధికారి గా బదిలీ చేసింది. ఎ. యాదగిరి మహబూబ్‌నగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పోస్టింగ్ ఇచ్చింది. మోహన్ సింగ్ రాజన్న-సిరిసిల్ల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా నియమించింది. పి. పద్మప్రియ హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ కు డిప్యుటేషన్‌పై బదిలీ చేసింది. సీహెచ్. కృష్ణయ్య మేడ్చల్ - మల్కాజిగిరి ఎల్బీ, ఖుజగా నియమించింది. జి. కుమారస్వామి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసింది.

## జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు

# నెలలోగా పరిష్కారం

**జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన.. నెలలోగా దరఖాస్తులు క్లియర్**

**సీఎం రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి**

**దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేశామన్న మంత్రి**

తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు.ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని పొంగులేటి వెల్లడించారు.సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఏ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని... 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన



మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొంది 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.




# సీజేపీ నిరసన..

## అర్ధరాత్రి నుంచి

# ఇంటర్నెట్ బంద్..

**ఢిల్లీ:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ధర్నాకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిరసనకు ఢిల్లీ పోలీసులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అయినప్పటికీ, నిరసనకు దిగేందుకు సీజేపీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఇప్పటికే పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తాజా ఆదేశాల ప్రకారం.. ఈరోజు అర్ధరాత్రి నుంచి ఢిల్లీ నగరాన్ని పోలీసులు అష్టదిగ్బంధనం చేయనున్నారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేయనున్నారు. దేశ రాజధానిలో - మిగతా3లో

## ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0

**: భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, అక్టోబరు 9:** ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈరోజు (శుక్రవారం) ప్రజాభవన్‌లో సమ్మిట్ వార్ రూమ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈ సమ్మిట్ ఏర్పాట్లపై భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ సమ్మిట్ జరుగుతుందని వెల్లడించారు.

**సమన్వయంతో పనిచేయాలి..**

వివిధ శాఖల కమిటీలు సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయా శాఖల మధ్య నిరంతర సమాచార మార్పిడి ఉండాలని స్పష్టంచేశారు. తెలంగాణకు ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షించడమే ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించారు. అంతర్జాతీయంగా తెలంగాణ ప్రతిష్ఠను పెంచేలా ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్ విజయవంతానికి ప్రతి శాఖ సమష్టిగా కృషి చేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

## సర్ లో అక్రమాలు

# జరిగాయి

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.SIR ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను




తొలగించారని ఆయన ఆరోపించారు.

హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

**ధికారంలో ఉన్నవారికి రక్షణ కవచం**

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి - మిగతా3లో

## తెలంగాణలో 95 లక్షల ఓట్ల తొలగింపు

# వార్త అవాస్తవం

**ఎన్నికల ప్రధానాధికారి**




**హైదరాబాద్, అక్టోబర్ 9:** తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగింపు వార్త అవాస్తవమని ఎస్ఈసీ తెలిపారు. 95 లక్షల ఓట్లను తొలగించారంటూ వచ్చిన వార్తపై తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి వివరణ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణపై తప్పుడు ప్రచారం జరుగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 73,39,235 మంది ఓటర్లను మాత్రమే ఏఎస్‌డీడీ ( కేటగిరీలో గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 92,88,187 నోటీసులు జారీ చేశామని చెప్పారు. 92,23,486 మంది ఓటర్లకు నోటీసులు అందగా.. ఇంకా 64,701 నోటీసులను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు నోటీసులు అందుకున్న వారిని 82,11,205 మంది విచారణలు పూర్తి అయినట్లు ఎస్ఈసీ తెలిపారు. తుది ఓటర్ల జాబితాలో చోటు కల్పించేందుకు 74,62,851 మందిని అర్హులుగా గుర్తించామని.. అనర్హులుగా గుర్తించిన ఓటర్లు 12,969 మంది మాత్రమే అని తెలిపారు. మరో 18,12,367 మంది ఓటర్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. 2026, నవంబర్ 5 లోపు మిగిలిన నోటీసులపై నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. ఓటర్ల జాబితాపై వచ్చిన వార్త వాస్తవాలకు దూరంగా ఉందన్న తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి పేర్కొన్నారు.

## సంపాదకీయం

# ఎరుపు రంగులోకి భుగోళం..

### సూపర్ డూపర్ ఎలినినో

పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన ఎల్ నినో క్రమంగా తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే దీని ప్రభావంతో భారత్ సహా దక్షిణాసియాలో నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఇది మరింత తీవ్రస్థాయికి చేరుకుంటుందని ఇటీవల ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. తాజాగా, అంతర్జాతీయ వాతావరణ నిపుణులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ.. సూపర్ ఎల్ నినో దెబ్బకు భూగోళం మొత్తం ఎరుపుగా మారిపోయిందని మ్యాప్‌ను షేర్ చేశారు.గతంలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరుకుంటోన్న ఎల్ నినో ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1950 తర్వాత నమోదుకాబోతున్న అత్యంత బలమైన వాతావరణ పరిణామాలలో ఇది ఒకటి కావచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పుల తీవ్రతను ఈ ఎల్ నినో మరింత పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రం అంతర్భాగంలో దాగివున్న అధిక ఉష్ణోగ్రతలను బయటకు విడుదల చేయడం వల్ల భూగోళంలో అత్యధిక భాగం అసాధారణమైన వేడిని ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.రియాన్ మౌ అనే అంతర్జాతీయ వాతావరణ నిపుణుడు మొత్తం భూగోళానికి సంబంధించిన క్లైమేట్ మ్యాప్‌ను సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో పంచుకుంటూ... భూగోళం అంతా దాదాపుగా ఎరుపు రంగులోకి (తీవ్రమైన వేడికి సూచికగా) మారిపోయిందని పేర్కొన్నారు. "అమెరికా మినహా మిగిలిన ప్రపంచమంతటా ఉష్ణోగ్రతలను విపరీతంగా పెంచుతూ ఈ ఎల్ నినో శీతాకాలంలో కూడా తన 'గరిష్ట ప్రతాపాన్ని' చూపిస్తోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎల్ నినో తీవ్రత వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్న ఔమీ అంచనాతో ఆయన కూడా ఏకీభవించారు.మరో శాస్త్రవేత్త జీకే హాస్‌ఫాథర్ స్పందిస్తూ... "ఈ ఏడాది ఎల్ నినో రికార్డులను తిరగరాస్తూ కొత్త గరిష్టాలకు చేరుకుంటోంది.. నినో 3.4 ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. ఇది ఇప్పటివరకు నమోదైన ఏ ఇతర ఎల్ నినో పరిణామం కంటే కూడా అత్యధికం" అని పేర్కొన్నారు. లియోన్ సిమన్స్ అనే మరో నిపుణుడు ఈ పరిణామాన్ని 'సూపర్-డూపర్ ఎల్ నినో' గా అభివర్ణించారు.ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 చివరి నెలల్లో ప్రపంచంలోని ఎక్కువ భాగంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఎల్ నినో పుట్టకకు కేంద్రమైన మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7 డిగ్రీల సెల్సియస్ (6.7 డిగ్రీల ఫారెన్‌హీట్) ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు.సాధారణంగా ఎల్ నినో అనేది సహజంగా సంభవించే 'ఎల్ నినో-సౌత్ ఐసోలేషన్' చక్రంలో భాగమైన ఒక వేడి దశ. ఇది ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఈ వాతావరణ మార్పుల వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, వర్షపాత వ్యవస్థలు దెబ్బతింటాయి. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరువు కాటకాలు, మరికొన్ని ప్రాంతాల్లో తుఫానులు, భారీ వర్షాలు సంభవిస్తాయి.ఈ అసాధారణ పరిస్థితుల వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తీవ్రమైన ఈదురుగాలులు, తీరప్రాంత వరదలు, బీచ్ కోత ప్రమాదాలు చాలా ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించిన కాలిఫోర్నియా గవర్నర్ గెవిన్ న్యూసమ్, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, శీతాకాలపు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గత నెలలోనే రాష్ట్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.సమీప కాలంలో ద్రవ్యోల్బణంపై సరఫరా వైపు నుంచి ఒత్తిళ్లు కొనసాగొచ్చని ఆర్బీఐ తెలిపింది. బలహీనమైన నైరుతి రుతుపవనాలు, ఎల్ నినో పరిస్థితులు, అంతర్జాతీయ చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు దీనికి కారణమవుతాయని పేర్కొంది. చమురును మినహాయిస్తే ఆహార విభాగంలోని పలు కమోడిటీల ధరల్లో కూడా ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. కోర్ ద్రవ్యోల్బణం పెరగడం, సీపీఐ బాస్కెట్‌లోని మరిన్ని వస్తువుల ధరలు పెరగడం చూస్తే ద్రవ్యోల్బణం ఒకటి రెండు వస్తువులకు పరిమితం కాకుండా విస్తృతంగా మారే తొలి సంకేతాలు కనిపిస్తున్నాయని ఆర్బీఐ తెలిపింది. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 2026-27లో సీపీఐ ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. రెండో త్రైమాసికంలో 4.9 శాతం, మూడో త్రైమాసికంలో 6.0 శాతం, నాలుగో త్రైమాసికంలో 5.7 శాతంగా ఉండొచ్చని తెలిపింది. 2027-28 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. దీనికి సంబంధించిన రిస్కులు కూడా ఇరువైపులా సమానంగా ఉన్నాయని పేర్కొంది. 2026-27 మొత్తం సంవత్సరానికి కోర్ ద్రవ్యోల్బణం 4.4 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది.అమెరికాలోని ఆరు రాష్ట్రాలు ఈ శీతాకాలంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం, భారీ హిమపాతాన్ని ఎదుర్కోనున్నాయి. కాలిఫోర్నియాతో పాటు నెవాడా, ఉతా, కొలరాడో, న్యూ మెక్సికో, అరిజోనా రాష్ట్రాలపై ఈ ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ రాష్ట్రాల్లోని పర్వత ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాల్లో సగటు కంటే చాలా ఎక్కువగా హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ పరిశోధకులు గత నెలలో వెలువరించిన వివరాల ప్రకారం... ఈ ఏడాది వచ్చిన ఈ 'సూపర్-ఎల్ నినో' కారణంగా జూన్ నుంచి ఫిబ్రవరి 2027 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 4,51,000 మందికి పైగా మరణించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## సుప్రీం కోర్టు తీర్పు

# స్థానిక ఎన్నికలకు షెడ్యూల్..

స్థానిక ఎన్నికల షెడ్యూల్ కు ముహూర్తం ఫిక్స్ అయింది. సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్ల పైన నిర్ణయం వెలువడింది. హైకోర్టు తీర్పునే సుప్రీం సమర్థించింది.ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్ ను తిరస్కరించింది. ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో.. షెడ్యూల్ ప్రకటించేలా ఎన్నికల సంఘం తుది కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్ల పైన అంచనాలు సిద్దం అయినట్లు తెలుస్తోంది. దీంతో.. రాష్ట్రంలో ఎన్నికల సమరం మొదలు కానుంది. బీసీ రిజర్వేషన్ల పై సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థించింది. 34 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు... రిజర్వేషన్లు 50 శాతం మించరాదని తేల్చి చెప్పింది. ఎన్నికల నిర్వహణ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైకోర్టు నిర్దేశించిన గడువు లోగా ఎన్నికలు నిర్వహించేలా సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది.దీంతో...స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు సహచర మంత్రులకు సీఎం చంద్రబాబు సైతం స్పష్టం చేశారు. ఈ రోజు (శుక్రవారం) సాయంత్రం లేదా 12వ తేదీన



నోటిఫికేషన్ రావడం ఖాయమని మంత్రివర్గ భేటీలోనే వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, కూటమి ఐక్యతకు భంగం కలిగించకుండా వ్యవహరించాలని ఆదేశించారు. పట్టణ స్థానిక సంస్థలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించే ఆలోచన ఉందన్నారు. కాగా, స్థానిక ఎన్నికల ప్రక్రియ నవంబరు నెలాఖరుకు ముగుస్తుందని తెలిపారు. దీంతో..నవంబర్ ద్వితీయార్థంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది.కాగా, ఇటు రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల పైన పూర్తి సమాయత్తం అవుతోంది. ఎన్నికల ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్షించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ దిశా నిర్దేశం చేసింది.ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై కమిషన్ అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణపై ఈ సమావేశంలో జిల్లా యంత్రాంగానికి ఎస్ఈసీ కీలక ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో, ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. అటు రాజకీయ పార్టీలు సైతం షెడ్యూల్ వేళ అప్రమత్తం అవుతున్నాయి.

# 54 మందికి ఒకే ఇల్లు అమ్మకం

### భాగ్యనగరంలో బడా మోసగాళ్లు

**హైదరాబాద్, అక్టోబరు 9:**హైదరాబాద్ నగరంలో ఆస్తి మోసాల ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకోవటం, నగరంలో ప్రాపర్టీలకు డిమాండ్ పెరగటంతో మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. తాజాగా.. ఒకే భవనాన్ని 54 మందికి విక్రయించి, తాకట్టు పెట్టి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసిన వ్యవహారం బయటపడగా.. మరోచోట ప్రభుత్వ అధికారుల సంతకాలు, కార్యాలయాల సీళ్లు ఫోర్జరీ చేసి నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించిన ముఠా గుట్టు రట్టయింది. ఇంకోవైపు ఖాళీగా ఉన్న భూములను గుర్తించి నకిలీ యజమానులను సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేయగా.. పలువురు నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తి మోసాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మల్కాజిగిరి సీపీ బి.సుమతి హెచ్చరించారు.మాదన్నపేట దారాబ్‌జంగ్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తులు, పెంట్‌హౌస్ ఉన్న భవనం రషాద్ ఉల్ ఖైర్, ముంతాజ్‌బేగం ఆధీనంలో ఉంది. దాన్ని వివిధ వ్యక్తులకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బ్రోకర్ల ద్వారా ప్రచారం చేయడంతోపాటు, నమ్మకం కలిగించేందుకు పెంట్‌హౌస్‌లో ఉంటున్న అస్మాబేగంను కిరాయిదారుగా చూపించారు. కొందరికి కొంతకాలం అద్దె కూడా చెల్లించారు. 2021 మార్చి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 54 మంది నుంచి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. రూ.15 లక్షలు నష్టపోయిన నయీం బాను ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అస్మాబేగంను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.మరో కేసులో డాక్యుమెంట్ రైటర్ దేవగుప్తపు వీర వెంకట సత్యనారాయణ, అతని మాజీ డ్రైవర్ పోలె రాజుతో కలిసి సుమారు ఎనిమిదేళ్లుగా నకిలీ ఆస్తి పత్రాల దందా సాగించినట్లు పోలీసులు గుర్తించారు. జీపీఏ, ఎస్‌పీఏ, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్టేజ్ రిలీజ్ వంటి పత్రాలతోపాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల సంతకాలు, నకిలీ




స్టాంపులు ఉపయోగించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లోని విలువైన స్థలాలకు సంబంధించిన నకిలీ పత్రాలను తయారు చేసినట్లు వెల్లడించారు. ఎల్బీనగర్‌లోని ఓ ఫ్లాట్‌పై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు 25 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, 41 నకిలీ రబ్బరు స్టాంపులు, పలు ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## భారతీయులకు

# ట్రంప్ మరో షాక్...

**హైదరాబాద్, అక్టోబరు 9:**అమెరికాలో పనిచేస్తున్న విదేశీ టెక్ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి అమెరికా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. విదేశీ ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మంజూరు ప్రక్రియలో కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి ప్రపంచ ప్రఖ్యాత ఐటీ అవుట్‌సోర్సింగ్ దిగ్గజాలను సస్పెండ్ చేస్తూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారన్న ఆరోపణలతో ఈ కఠిన చర్యలు చేపట్టింది. జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, కాప్‌జెమినిలతో పాటు ప్రముఖ టెక్ సంస్థలు మైక్రోసాఫ్ట్, అడోబ్ కూడా ఉన్నాయని అమెరికా కార్మిక శాఖ స్పష్టం చేసింది. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని యాంటీ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్ సమక్షంలో వైట్‌హౌస్ వేదికగా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇకపై ఈ కంపెనీల నుంచి ఎలాంటి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించబోమని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను కూడా పూర్తిగా నిలిపివేస్తున్నామని వెల్లడించారు.పెర్మ్ ప్రక్రియ అంటే.. అమెరికాలో ఒక కంపెనీ విదేశీ ఉద్యోగికి గ్రీన్ కార్డ్ ఇబీ-2, ఇబీ-3 కేటగిరీలు స్పాన్సర్ చేయాలంటే, మొదటగా కార్మిక శాఖ నుంచి ఈ లేబర్ సర్టిఫికేషన్ పొందడం తప్పనిసరి చట్టబద్ధమైన మొదటి మెట్టు. సదరు ఉద్యోగం చేసేందుకు స్థానికంగా అర్హులైన అమెరికన్ పౌరులు ఎవరూ అందుబాటులో లేరని, విదేశీయుడిని తీసుకోవడం వల్ల



అమెరికన్ వర్కర్ల వేతనాలపై ప్రతికూల ప్రభావం పడటం లేదని కంపెనీలు సాక్ష్యాధారాలతో కార్మిక శాఖకు నిరూపించాల్సి ఉంటుంది. కార్మిక శాఖ ఈ సర్టిఫికేట్‌ను ఆమోదించిన తర్వాతే కంపెనీలు యూఎస్‌సీఐఎస్ వద్ద ఐ-140 పిటిషన్ దాఖలు చేయగలవు. ఇప్పుడు ఈ ప్రధాన మార్గాన్నే నిలిపివేయడంతో, ఈ కంపెనీలు తమ విదేశీ ఉద్యోగుల తరఫున కొత్తగా గ్రీన్ కార్డ్ ప్రక్రియను ప్రారంభించే అర్హతను తాత్కాలికంగా కోల్పోయినట్లయింది.అమెరికా అధికార యంత్రాంగం ఈ కఠిన చర్యకు దిగడానికి హెచ్-1బీ , పెర్మ్ నిబంధనల దుర్వినియోగమే ప్రధాన కారణమని స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఈ దిగ్గజ ఔట్‌సోర్సింగ్ సంస్థలు దాదాపు 30 లక్షల మంది విదేశీ నిపుణుల కోసం దరఖాస్తులు చేశాయని, 2.3 లక్షలకు పైగా హెచ్-1బీ అప్రూవల్స్, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు పొందాయని యూఎస్ కార్మిక శాఖ పేర్కొంది. అమెరికన్ వర్కర్లకు సమాన అవకాశాలు కల్పించకుండా స్థానిక ఉద్యోగాలను కొల్లగొట్టేలా లేబర్ మార్కెట్ నిబంధనలను ఉల్లంఘించారని, ఫెడరల్ దర్యాప్తులు ఎదుర్కొంటున్నందున ఈ సస్పెన్షన్ వేటు వేశామని వివరించింది. తాజా చర్యలు అమెరికన్ నిరుద్యోగుల హక్కులను కాపాడేందుకేనని ప్రభుత్వం సమర్థించుకుంది.ఈ నిర్ణయం అమెరికాలోని భారతీయ ఐటీ నిపుణులకు, గ్రీన్ కార్డ్ ఆశావహులకు తీరని ఎదురుదెబ్బగా పరిణమించనుంది. ఈ సంస్థల్లో పనిచేస్తూ ఇప్పటికే పెర్మ్ అనుమతుల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయ టెక్కీల భవిష్యత్తు ఒక్కసారిగా అనిశ్చితిలో పడింది. కొత్తగా దరఖాస్తులు ఆగిపోవడంతో పాటు, పెండింగ్ ఫైల్స్ కూడా నిలిచిపోవడం వల్ల గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్ మరింత తీవ్ర జాప్యానికి గురవుతుంది. ఇది భారత ఐటీ కంపెనీల వ్యాపార కార్యకలాపాలు, ఆన్-సైట్ డిప్లాయ్‌మెంట్ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశముంది. అమెరికా అధికారులు ఈ కంపెనీల అంతర్గత విధానాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, సస్పెన్షన్‌ను ఎత్తివేసే వరకు ఈ సంస్థల్లోని ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మొదటి అడుగు పడటం అసాధ్యంగా మారనుంది.

# రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి

**సిద్దిపేట:**సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో రైల్వే ప్రాజెక్టు ముఖ్య అధికారులు, రెవెన్యూ,అర్ అండ్ బి, పిఆర్ అధికారులతో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎన్. నవ్య శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో రైల్వే లైన్ నిర్మాణంలో పెండింగ్ లో సమస్యలు, బ్రిడ్జి నిర్మించే ప్రాంతాల్లో భూ సేకరణ వివరాలు గూర్చి రైల్వే అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. చిన్నకోడూరు మండలంలో చిన్నకోడూరు మాచాపూర్, గంగాపూర్ విఠలాపూర్, నారాయణరావు పేట మండలం లో గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్




సమస్యల గూర్చి అధికారులతో క్లుప్తంగా చర్చించారు. పెండింగ్ లో ఉన్న ప్రాంతాలను రైల్వే, రెవెన్యూ, అర్ అండ్ బి, పిఆర్, అందరూ కలిసి పర్యవేక్షణ చేసి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టే దగ్గర డైవర్షన్ బీటీ రోడ్ ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, భూ సేకరణ పెండింగ్ తదితర పూర్తి సమాచారాన్ని జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రైల్వే పనుల వల్ల పక్కన రైతులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చెయ్యాలని, బ్రిడ్జి నిర్మాణాలు వేగంగా పూర్తి చెయ్యాలని రైల్వే అధికారులను ఆదేశించారు. రైల్వే పనులు అయ్యేంతవరకు స్థానిక శాఖల అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ సదానందం, రైల్వేస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూర్తి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు



# కాంగ్రెస్ వ్యూహాలకు ఎదురుదెబ్బలు...

హైదరాబాద్, అక్టోబరు 9:తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఆ పార్టీ దూకుడును అడ్డుకునేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులు కోర్టుల్లో నిలవట్లేదు. బలమైన సెక్షన్లు నమోదు చేయకపోవడంతో కేసులు కోర్టుల్లో వీగిపోతున్నాయి. ఇది అధికార పార్టీ వర్గాల్లో తీవ్ర కలవరం రేపుతోంది. రాజకీయ ప్రత్యర్థుల దూకుడుకు కళ్లెం వేయాలని భావిస్తున్న కాంగ్రెస్ వ్యూహాలు అడుగుడుగునా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తమను అప్పటి ప్రభుత్వం ఎలా వేధించిందో, ఎన్నిసార్లు జైలుకు పంపిందో కాంగ్రెస్ నేతలు పదే పదే గుర్తుచేసుకుంటున్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్థాయిలో ప్రతిపక్ష నేతలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని భావించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిని, ఇతర ప్రముఖ నాయకులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై అధికార పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు.అయితే.. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల్లో గట్టి సెక్షన్లు ఉండటం



లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రపు సెక్షన్ల కారణంగా నిందితులు సులభంగా కోర్టుల నుంచి ఊరట పొందుతున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ దక్కకపోగా, కొద్ది గంటల్లోనే బెయిల్ పై బయటకు వస్తున్నారు. ఇది కాంగ్రెస్ శ్రేణులను నిరుత్సాహపరుస్తోంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కఠినమైన పోలీసు చర్యలను ఎదుర్కొన్నామని.. కానీ ఇప్పుడు ప్రతిపక్షాలపై అలా ఎందుకు వ్యవహరించలేకపోతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ భవిష్యత్తులో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏమిటనే అభద్రతాభావం కొందరు నేతల్లో కనిపిస్తోంది.పోలీస్ యంత్రాంగం సరైన లీగల్ సెక్షన్లను ప్రయోగించడంలో విఫలమవుతోందని, దీనివల్ల అధికార పార్టీ పరువు పోవడంతో పాటు ప్రత్యర్థులకు రాజకీయ మైలేజీ దక్కుతోందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ, తగిన ఆధారాలతో కూడిన పటిష్టమైన ఎఫ్ఐఆర్లు నమోదు కాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని వాపోతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో కీలక చర్చ జరుగుతోంది. ఎంతమందిపై కేసులు పెట్టామనేదాని కంటే, పెట్టిన కేసులు ఎంత బలంగా ఉన్నాయనే దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. సోషల్ మీడియా పోస్టులు లేదా వ్యక్తిగత విమర్శల విషయంలో ప్రత్యర్థులను న్యాయపరంగా గట్టిగా నిలువరించాలంటే మరింత లోతైన లీగల్ రీసెర్చ్, పకడ్బందీ చట్టపరమైన చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.ఎదుటివారి దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో ప్రస్తుత వ్యూహాత్మక లోపాలను సరిదిద్దకపోతే, అది రాబోయే కాలంలో పార్టీకి మరింత నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. ఏది ఏమైనప్పటికీ, చట్టపరమైన చిక్కులను అధిగమించి బీఆర్ఎస్ దూకుడును కట్టడి చేయడం కాంగ్రెస్ సర్కార్కు ప్రస్తుతం పెద్ద సవాల్గా మారింది.

# హుస్సేన్ సాగర్ టూ ప్రకాశం బ్యారేజ్ సీప్లేన్

హైదరాబాద్, అక్టోబరు 9:హైదరాబాద్లోని హుస్సేన్సాగర్ నీటిపై విమానం వేగంగా దూసుకెళ్లి ఆకాశంలోకి ఎగరడం, క్షణాల్లో కృష్ణా తీరానికి చేరుకుని విజయవాడ ప్రకాశం బ్యారేజీ జలాల్లో ల్యాండ్ అవ్వడం.. వినడానికే ఎంతో అద్భుతంగా అనిపించే ఈ ఊహ త్వరలోనే నిజరూపం దాల్చేలా కనిపిస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్–విజయవాడ నగరాల మధ్య నిత్యం వేలాది మంది ప్రయాణికులు జాతీయ రహదారులు, ఎక్స్ప్రెస్ రైళ్లు, శంషాబాద్–గన్నవరం విమాన సర్వీసులపై ఆధారపడుతున్నారు. అయితే, సాధారణ రవాణా వ్యవస్థకు పూర్తి భిన్నంగా, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగే అత్యాధునిక సీప్లేన్ సేవలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ సర్వీసులు ప్రారంభమైతే ప్రయాణ సమయం ఆదా కావడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల పర్యాటక రంగానికి ఊహించని సరికొత్త ఊపు లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సాహసోపేత, జల పర్యాటకాన్ని ఇష్టపడే దేశ, విదేశీ పర్యాటకులకు ఇదొక అద్భుతమైన అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తూ, నూతన పర్యాటక పాలసీని రూపొందించి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి గతంలో ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రితో భేటీ అయినప్పుడు హుస్సేన్సాగర్–ప్రకాశం బ్యారేజీల మధ్య సీప్లేన్ సేవల నిర్వహణ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సమావేశం అనంతరం ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే ప్రక్రియ ఊపందుకుంది.దీనిలో భాగంగా భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ)కి చెందిన ఉన్నతాధికారుల ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టింది. రాష్ట్ర పర్యాటకశాఖ, హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఉన్నతాధికారులతో కలిసి ఏఏఐ ప్రతినిధులు హుస్సేన్సాగర్లోని వివిధ ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. జల విమానాలు సురక్షితంగా నీటిపై దిగేందుకు (ల్యాండింగ్), పైకి ఎగిరేందుకు (టేకాఫ్) అవసరమైన నీటి లోతు, ఉపరితల వైశాల్యం, ప్రవాహ వేగం వంటి సాంకేతిక అంశాలను లోతుగా లెక్కించారు. దీంతోపాటు విమానం నీటిపై ప్రయాణించే మార్గం (ట్యాక్సీ పార్క్), ప్రయాణికులు ఎక్కేందుకు మరియు దిగేందుకు వీలుగా జెట్టీలు, ప్యాసింజర్



టెర్మినల్ సదుపాయాలు ఎక్కడ ఏర్పాటు చేయవచ్చనే అంశాలపై సమగ్ర పరిశీలన జరిపారు.హుస్సేన్సాగర్లో చేపట్టిన క్షేత్రస్థాయి తనిఖీలకు సంబంధించిన అన్ని సాంకేతిక, పర్యావరణ వివరాలతో ఏఏఐ నిపుణుల బృందం త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను (డీపీఆర్ రూపంలో) సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపు, ఏజెన్సీల ఎంపికపై కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

# ఓంకారేశ్వరస్వామి ఆలయం నుంచే అంతా

హైదరాబాద్, అక్టోబరు 9:తెలంగాణ రాజకీయాల్లో మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు నది పరీవాహక ప్రాంతాల అభివృద్ధి, మరోవైపు చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాల పునరుద్ధరణ పేరిట ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా మంచిరేవుల ప్రాంతంలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ఏకంగా రూ. 1108.27 కోట్ల నిధులను కేటాయించింది. ఈ ఆలయానికి సుమారు 1,400 ఏళ్ల చరిత్ర ఉంది.ఈ ప్రాజెక్టును కేవలం ఆలయ పునరుద్ధరణకు మాత్రమే పరిమితం చేయట్లేదు. దీని వెనుక బలమైన రాజకీయ, వ్యూహాత్మక కోణాలు దాగి ఉన్నాయి. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై మొదటి నుంచి విపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మతపరమైన, సాంస్కృతిక అంశాలను తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని ఆకర్షించాలని అధికార పార్టీ ఎత్తుగడ వేసినట్లు అర్థమవుతోంది. రూ. 700 కోట్ల ప్రాథమిక అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 1,108 కోట్లకు పెంచడం ప్రభుత్వ ప్రాధాన్యతలను, సంకల్పాన్ని చాటుతోంది. దక్షిణ కాశీగా అభివర్ణిస్తూ చేపట్టబోయే ఈ అభివృద్ధి పనుల్లో రూ. 598.98 కోట్లు కేవలం నిర్మాణ పనులకే కేటాయించడం విశేషం. అలాగే 100 అడుగుల భారీ శివుడి విగ్రహం, రాజగోపురాలు, పుష్కరిణి వంటి హంగులు దీనికి వన్నె తేనున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాలను అనుసంధానించేందుకు రూ. 159.62 కోట్లతో ఆరు లైన్ల రహదారి నిర్మాణాన్ని కూడా చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కేవలం ఆధ్యాత్మిక పర్యాటకానికే పరిమితం కాకుండా, రియల్ ఎస్టేట్ రంగాన్ని, ముఖ్యంగా నార్సింగి, కోకాపేట, మణికొండ పరిసర ప్రాంతాల్లోని భూముల విలువను మరింత పెంచుతుందనే వాదన కూడా ఉంది.గత ప్రభుత్వాల హయాంలో ఓంకారేశ్వర ఆలయ పునరుద్ధరణ అంశం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్యాచరణ దిశగా అడుగులు వేస్తోంది. అయితే, ప్రజాధనాన్ని భారీగా వెచ్చిస్తున్న ఈ ప్రాజెక్టులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిర్దేశిత సమయంలోగా పారదర్శకంగా పూర్తవుతాయా లేదా అనేదే పెద్ద సమస్యగా మారింది. ఏది ఏమైనప్పటికీ, మూసీ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ ఆలయాల పునరుద్ధరణ తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపింది.

# తెలంగాణలోకి అకున్ సబర్వాల్

హైదరాబాద్, అక్టోబరు 9:సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ తిరిగి తెలంగాణ క్యాడర్లోకి రానున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర పోలీసు, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కేంద్ర డిప్యుటేషన్ పూర్తి చేసుకున్న ఆయనకు త్వరలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో.. గతంలో ఆయన చేపట్టిన సంచలనాత్మక టాలీవుడ్ డ్రగ్స్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. 2017లో హైదరాబాద్లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ రాకెట్ దర్యాప్తులో అప్పటి ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్గా ఉన్న అకున్ సబర్వాల్ కీలక పాత్ర పోషించారు. ఆయన నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం పలువురు సినీ ప్రముఖులను విచారించింది.అప్పట్లో ఎల్ఎస్డీ,ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల సరఫరా వ్యవహారం హైదరాబాద్లో సంచలనం సృష్టించింది. డ్రగ్ పెడ్లర్ల అరెస్టుల అనంతరం వారి కాంటాక్ట్ లిస్టుల్లో సినీ ప్రముఖుల ఫోన్ నంబర్లు ఉన్నాయన్న అంశం ఆధారంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారించారు. అయితే కేవలం ఫోన్ నంబర్లు ఉండటం, పరిచయం ఉండటం మాత్రమే నేరానికి ఆధారం కాదని దర్యాప్తు సంస్థలు స్పష్టం చేశాయి. అప్పట్లో సినీ పరిశ్రమను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారన్న విమర్శలను సబర్వాల్ కూడా ఖండించారు.తదుపరి దశలో ఈ కేసుల దర్యాప్తు తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయి. 2024లో ఈ వ్యవహారానికి సంబంధించిన ఆరు కేసులను తగిన ఆధారాలు లేవన్న కారణంతో కోర్టు కొట్టివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. దర్యాప్తులో అనుసరించాల్సిన




విధానాలు పాటించలేదని, కొన్ని కేసుల్లో సరైన సాక్ష్యాలు లేవని కోర్టు పేర్కొన్నాయి.ఇక అంతకు ముందే అకున్ సబర్వాల్ కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన తిరిగి తెలంగాణకు రావడం సహజంగానే పాత కేసుపై ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన రాకతో డ్రగ్స్ కేసును ప్రభుత్వం తిరిగి తెరుస్తుందనే ప్రచారం జరుగుతోంది. దాంతో పాటు ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇస్తారన్నది కూడా చర్చనియాంశంగా మారింది. రేవంత్ సర్కార్ డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతుండగా.. తిరిగి అదే బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న చర్చ కూడా నడుస్తోంది.ఒకవేళ ఆయనకు ఆ బాధ్యతలనే అప్పగిస్తే.. అప్పటి దర్యాప్తులో నమోదైన అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి సమీక్షిస్తుందా ? దర్యాప్తులో ప్రస్తావనకు వచ్చిన పేర్లపై మరింత లోతైన విచారణకు అవకాశం ఉంటుందా అప్పట్లో రాజకీయ, సినీ వర్గాల్లో చర్చకు వచ్చిన ఇతర పేర్లు ఏమైనా అధికారిక దర్యాప్తు రికార్డుల్లో ఉన్నాయా ? ఉంటే వాటి వివరాలు ప్రజలకు వెల్లడవుతాయా ? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తంగా అకున్ సబర్వాల్ రీఎంట్రీతో పాత డ్రగ్స్ కేసు రాజకీయ రంగు పులుముకుంటుందా, లేక ఇది కేవలం ఒక సీనియర్ అధికారి క్యాడర్ రిటర్న్గానే మిగిలిపోతుందా అన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. ఆయనకు లభించే పోస్టింగ్, ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చే అవకాశం ఉంది.ఇక అకున్ సబర్వాల్ సతీమణి సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ వ్యక్తిగత కారణాలతో లాంగ్ లీవ్లో ఉన్న విషయం తెలిసిందే.

## సీజేపీ నిరసన.. అర్ధరాత్రి నుంచి ఇంటర్నెట్ బంద్..

- మొదటి పేజీ తరువాయి

దుకాణాలు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించారు. రాత్రి 10 గంటల నుంచి 57 మెట్రో స్టేషన్ల గేట్లను మూసివేయనున్నారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లలో పలు సర్వీసులను నిలిపివేశారు. హోటళ్లు, పీజీ హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సెంట్రల్ ఢిల్లీలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 163 అమలు చేస్తున్నారు. నగరంలో ఎలాంటి నిరసనలు, ధర్నాలకు అనుమతి లేదని మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. సెంట్రల్ ఢిల్లీ వ్యాప్తంగా 23 వేల మంది కేంద్ర బలగాలతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.కాగా, అక్టోబర్ 10 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. అయితే, తమకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టును సీజేపీ ఆశ్రయించింది. దీనిపై నేడు విచారణ జరిపిన ధర్మాసనం.. శాంతియుత నిరసనలకు జంతర్ మంతర్ కాకుండా మరోచోట అనుమతి ఇవ్వాలని ఆదేశించింది. అవసరమైన మేరకే నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొంటూ ఆదేశాలు జారీ చేసింది.

## సర్ లో అక్రమాలు జరిగాయి

- మొదటి పేజీ తరువాయి

రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు

## బండి భగీరథ్ హైకోర్టులో ఊరట

హైదరాబాద్, అక్టోబరు 10:కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి మీడియా, సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న ప్రసారాలను తక్షణమే నిలిపివేయాలని



న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది.సదరు కేసులో తనకు ఇప్పటికే రెగ్యులర్ బెయిల్ మంజూరైనప్పటికీ, కొన్ని టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ ఆ కేసుకు సంబంధించిన అంశాలను ప్రసారం చేస్తూ తమ కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపిస్తూ భగీరథ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్పై జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది.భగీరథ్ తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వ్యక్తిగత కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోక్సో కేసుతో ముడిపెట్టి మీడియా ట్రయల్ నిర్వహిస్తున్నారని, ఇది వ్యక్తిత్వ హననానికి దారితీస్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న అభ్యంతరకర కంటెంట్ను తొలగించి, డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని ఆయన కోరారు.వాదనలు విన్న ధర్మాసనం, ఈ కేసుకు సంబంధించి ఎలాంటి కంటెంట్ను ప్రసారం చేయవద్దని టీవీ ఛానెళ్లు, ప్రైవేట్ వ్యక్తులు, సోషల్ మీడియా హ్యాండిల్స్ను ఆదేశించింది. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ సంస్థలు సంబంధిత కంటెంట్ను తక్షణమే తొలగించి, డిజిటల్ రికార్డులను భద్రపరచాలని సూచించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కోరుతూ కేంద్ర సమాచార, ఎలక్ట్రానిక్స్ శాఖలు, తెలంగాణ ప్రభుత్వం, డీజీపీ, సోషల్ మీడియా సంస్థలతో పాటు పలువురు ప్రైవేట్ వ్యక్తులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

## కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్వే ట్రాఫిక్ విధానాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం

**జూబ్లీహిల్స్ చెక్పోస్ట్ నుంచి ఎన్ఎఫ్సీఎల్ జంక్షన్ వరకు సమగ్ర స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళిక**

**రూ.1,090 కోట్లతో రెండు ప్యాకేజీల్లో ఫ్లైఓవర్ నిర్మాణం**

**భూసేకరణ, నిర్మాణ వ్యయాల్లో రూ.1,200 కోట్ల వరకు ఆదా చేయాలని లక్ష్యం**

హైదరాబాద్ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలు చేస్తున్న వన్వే ట్రాఫిక్ విధానాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వన్వే అమలవుతున్న పలు



ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ పరిస్థితులు, జంక్షన్ల వద్ద రద్దీని పరిశీలించి అధికారులతో సమీక్షించారు.మంత్రి మాట్లాడుతూ గతంలో కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అండర్పాస్లు, ఫ్లైఓవర్లు, ఇతర గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. అయితే, వన్వే ట్రాఫిక్ విధానం అమలుతో ఏర్పడిన పరిస్థితులు, ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని గతంలో ప్రతిపాదించిన నిర్మాణ ప్రణాళికలను పునఃసమీక్షించి, వన్వే విధానాన్ని కొనసాగిస్తూ ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జీహెచ్ఎంసీ చేపడుతున్న చర్యలను అధికారులతో సమీక్షించాను. గతంలో చెట్ల తొలగింపునకు సంబంధించిన అనుమతులపై న్యాయస్థానాల్లో పెండింగ్లో ఉన్న కేసుల కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని ప్రాజెక్టు రూపకల్పనను పునఃసమీక్షించాలని సూచించామని అన్నారు.

## హైదరాబాద్లోకి ఫ్లయింగ్ ఫ్లీ ఎలక్ట్రిక్ బైక్స్..

రాయల్ ఎన్ఫీల్డ్కు చెందిన ఎలక్ట్రిక్ మొబిలిటీ బ్రాండ్ ఫ్లయింగ్ ఫ్లీ హైదరాబాద్లో తన కార్యకలాపాలను ప్రారంభించింది. బెంగళూరులో వినియోగదారుల నుంచి వచ్చిన మంచి స్పందనతో దేశవ్యాప్తంగా విస్తరణ చేపడుతున్న సంస్థ.. హైదరాబాద్లో నాలుగు సేల్స్, సర్వీస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎర్రగడ్డలో ప్రత్యేక స్టోర్తో పాటు మరో మూడు సర్వీస్ కేంద్రాల ద్వారా వినియోగదారులకు విక్రయాలు, సాంకేతిక సహాయం, నిర్వహణ సేవలు అందించనుంది.

వార్తాతరంగాలు
శనివారం 10 అక్టోబర్ 2026

## అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన చెస్ క్రీడాకారిణి శివాంశికను అభినందనలు

మంత్రి పొన్నం



హైదరాబాద్:జమ్మూలో నిర్వహించిన అండర్-17 జాతీయ స్థాయి చెస్ పోటీల్లో రజత పతకం సాధించి, వరల్డ్ యూత్ కామన్వెల్త్ పోటీలకు ఎంపికైన ఔజవీ, ఔఖీవీ టైటిల్ హోల్డర్ శివాంశికను మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్లోని మినిస్టర్ క్వార్టర్స్లో అభినందించి సత్కరించారు.మంత్రి మాట్లాడుతూ చిన్న వయసులోనే చెస్లో అసాధారణ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రజత పతకం సాధించడం ఎంతో అభినందనీయం. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం మన రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు.భవిష్యత్తులో శివాంశిక మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. తన ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించి, మరెందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

## ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా.. నేను గోకుతూనే ఉంటా!: వెంకట్ బల్మూర్

**కేటీఆర్ బాగోతాలను ప్రతీ వారం సీరియల్‌లా బయటపెడతానన్న వెంకట్ బల్మూర్**
**ఆయన ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' పంపిస్తున్నట్లు వెల్లడి**
**డెక్కన్ సెరాయ్ హోటల్ వ్యాపారంపై విచారణ జరపాలని డిమాండ్**
**ఓ సినీ నటితో చేసిన చాటింగ్‌ను కేటీఆర్ ఎందుకు డిలీట్ చేశారని ప్రశ్న**
**కేసీఆర్, కేటీఆర్ మధ్య మాటలు లేవని, మధ్యవర్తిత్వం జరుగుతోందని వ్యాఖ్య**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యవహారశైలిపై సంచలన ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై ప్రతీ వారం ఒక సీరియల్ లాగా ఆయన బాగోతాలను బయటపెడతానని హెచ్చరించారు. "ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా, నేను గోకుతూనే ఉంటా" అని వ్యాఖ్యానించిన బల్మూర్, కేటీఆర్ ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' (ఇచ్ గార్డ్) పంపిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకట్ బల్మూర్ మాట్లాడుతూ.. తాము కేటీఆర్ బాగోతాలు బయటపెడితే, బీఆర్ఎస్ నేతలు తమ ముఖ్యమంత్రిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. 2019 నుంచి 2022 మధ్య ఓ సినీ నటితో జరిపిన సోషల్ మీడియా సంభాషణలను కేటీఆర్ ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ హోటల్ వ్యాపార రహస్యాలు ప్రజల ముందు ఉంచాలన్నారు. "2015లో రూ.5 కోట్లుగా ఉన్న డెక్కన్ సెరాయ్ హోటల్ షేర్ విలువ, పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగింది? ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరతాం" అని స్పష్టం చేశారు. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పే కేటీఆర్, పాస్‌పోర్ట్ సీజ్ చేయాలన్న పోలీసుల అభ్యర్థనపై కోర్టును ఎందుకు ఆశ్రయించారని బల్మూర్ ప్రశ్నించారు. కేటీఆర్ చెప్పేవి నీతి మాటలని, చేసేవి అవినీతి పనులని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తుంటే, కేటీఆర్ డ్రగ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. తాను చెప్పేవన్నీ అబద్ధాలైతే కేటీఆర్ లైవ్‌లోకి వచ్చి వాస్తవాలు చెప్పాలని, డ్రగ్ టెస్టుకు సిద్ధమని ప్రకటించాలని సవాల్ విసిరారు. ప్రస్తుతం కేసీఆర్ కూడా కేటీఆర్‌తో మాట్లాడటం లేదని, తండ్రీకొడుకుల మధ్య పంచాయతీని నవీన్ రావు తండ్రి కొండల్ రావు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని బల్మూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఎందుకు ఎవరితో కలవడం లేదో బీఆర్ఎస్ మిత్రులు కూడా ఆలోచించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా, ఫాంహౌస్ లో కేటీఆర్ కు రహస్య ట్రీట్ మెంట్ అంటూ సంచలన ట్వీట్లు కూడా చేశారు.

## ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది: హరీశ్ రావు

**అధికారంలో ఉన్నవారికి ఈసీ రక్షణ కవచం కాదన్న హరీశ్**
**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్**
**అన్నిటికన్నా ప్రజాస్వామ్యం గొప్పదని వ్యాఖ్య**



భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి: కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

**ఢిల్లీ, అక్టోబర్ 9:** సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఇండియా కూటమి ఎంపీలపై కేంద్రం పోలీసుల ద్వారా రాజ్యం ఏలుతోందని విమర్శించారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసులతో భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీల సమావేశం జరుగనుందని తెలిపారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని ఎంపీ అన్నారు. తప్పు చేసిన జ్ఞానేష్ కుమార్, తప్పు చేయించిన మోదీ, అమిత్ షా శిక్షకు అర్హులని వ్యాఖ్యానించారు. ఆందోళనలు అణచివేయడానికి ఛత్తీస్‌గఢ్ నుంచి 7 వేల మంది బలగాలను ఢిల్లీకి తీసుకొచ్చారని మండిపడ్డారు. సీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేస్తామని చెప్తే ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరూ నిరసన చేయకుండా అడ్డుకోవాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు.

# మలుపులు తిరుగుతున్న రాజకీయం...

## రేవంత్ టార్గెట్ గా కేటీఆర్ 'ఓపెన్ లెటర్స్'



**హైదరాబాద్, అక్టోబరు 9:**తెలంగాణ రాజకీయం ప్రతిరోజూ కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా నిర్ణయాలు, వివాదాస్పద వ్యాఖ్యలు, బిఆర్ఎస్ శ్రేణులపై జరుగుతున్న పోలీసు కేసుల విచారణల సందర్భంలో.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదే పదే కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖలు రాయడం , ఎక్స్ వేదికగా నేరుగా ట్యాగ్ చేస్తూ రేవంత్‌ను అదుపులో పెట్టుకోండి అని డిమాండ్ చేయడం చర్చనీయాంశమవుతోంది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా, తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యర్థి పార్టీ నాయకుడు ఫిర్యాదు చేస్తే రాహుల్ గాంధీ చర్యలు తీసుకుంటారా అంటే.. అసలు అటువంటి అవకాశమే లేదనేది అందరికీ తెలిసిన సత్యం. మరి లాజిక్‌కు అందని ఈ ఫిర్యాదుల వ్యూహం వెనుక కేటీఆర్ , బిఆర్ఎస్ ఆశిస్తున్న అసలు రాజకీయం ఏమిటి?కేటీఆర్ లక్ష్యం రాహుల్ గాంధీ ద్వారా రేవంత్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చేయడం కాదు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ప్రచారం చేసే భారత రాజ్యాంగ పరిరక్షణ , ప్రజాస్వామ్య విలువలు , వ్యక్తి స్వేచ్ఛ అనే సిద్ధాంతాలలోని నైతిక వైరుధ్యాన్ని జాతీయ స్థాయిలో ఎండగట్టడమే బిఆర్ఎస్ ప్రధాన వ్యూహం. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ సోషల్ మీడియా నేతలను అరెస్ట్ చేస్తుంటే , విపక్షాల ప్రతినిధులపై కేసులు పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్నను కేటీఆర్ సమాజం ముందుకు తెస్తున్నారు.ఈ వ్యూహంలో ఉన్న మరో కీలకమైన అంశం.. నైతిక బాధ్యత ను అధిష్ఠానం భుజాన పెట్టడం. రేవంత్ రెడ్డి చేసే వ్యాఖ్యలు , నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ అధికారిక విధానమా కాదా అని ప్రశ్నించడం ద్వారా, రేవంత్ చర్యలకు రాహుల్ గాంధీ కూడా నైతిక బాధ్యత వహించక తప్పని పరిస్థితిని బిఆర్ఎస్ కల్పిస్తోంది. రాహుల్ గాంధీ ఈ ఫిర్యాదులపై స్పందించకపోయినా లేదా మౌనంగా ఉన్నా.. అది రేవంత్ నిర్ణయాలకు రాహుల్ మద్దతు ఉందనే సంకేతం అని, కాంగ్రెస్ మార్క్ సిద్ధాంతాలు కేవలం ప్రచారానికేనని నెటిజన్లలో ప్రచారం చేయడానికి బిఆర్ఎస్‌కు ఒక బలమైన లీడ్ లభిస్తోంది. దీనికితోడు, తెలంగాణ రాజకీయాలను కేవలం హైదరాబాద్ బోర్డర్లకే పరిమితం చేయకుండా జాతీయ మీడియా , ఢిల్లీ రాజకీయ వర్గాల్లోకి తీసుకెళ్లడానికి ఈ 'ఓపెన్ లెటర్స్' వ్యూహం తోడ్పడుతోంది. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నేరుగా ట్యాగ్ చేస్తూ లేఖలు రాసినప్పుడు లేదా విమర్శలు చేసినప్పుడు నేషనల్ మీడియా కూడా దీనిపై దృష్టి సారిస్తోంది. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చే విమర్శలు, ఆరోపణలు జాతీయ స్థాయిలో హైలైట్ అయ్యి కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీసే అవకాశం ఏర్పడుతోంది.అలాగే, కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు, సీనియర్ నేతల అసంతృప్తిపై మానసిక ఒత్తిడి పెంచడం కూడా ఇందులో దాగి ఉన్న మరో ప్లాన్. సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై ఢిల్లీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లడం వల్ల, కాంగ్రెస్‌లోని రేవంత్ వ్యతిరేక వర్గానికి లేదా పాతకాపులకు ఒక రకమైన రాజకీయ మద్దతు లభిస్తుందని, అది కాంగ్రెస్ అంతర్గత విభేదాలను మరింత ఉద్రేకపరుస్తుందని బిఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు, ఈ ఫిర్యాదులపై కాంగ్రెస్ శ్రేణులు , సీఎం రేవంత్ రెడ్డి చాలా తేలికగా స్పందిస్తున్నారు. ప్రత్యర్థి ఫిర్యాదులను చూసి ఏ హైకమాండ్ కూడా తమ ప్రజాదరణ ఉన్న ముఖ్యమంత్రిని తప్పు పట్టదని, కేటీఆర్ కేవలం సోషల్ మీడియా పబ్లిసిటీ మరియు కవరేజ్ కోసమే ఇటువంటి డ్రామాలు ఆడుతున్నారని కాంగ్రెస్ డిజిటల్ వింగ్ తిప్పికొడుతోంది. కేటీఆర్ రాహుల్ గాంధీకి చేసే ఫిర్యాదులు రేవంత్ రెడ్డి పదవిని ఊడగొట్టడానికి కాదని, రాహుల్ గాంధీ నైతికతను ప్రశ్నించడం ద్వారా జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లో పడేయడానికి వేస్తున్న ఒక తెలివైన పొలిటికల్, మీడియా గేమ్ అని బీఆర్ఎస్ నేతలంటున్నారు.

## ఓటర్ల నమోదుకు పెద్ద ఎత్తున అప్లికేషన్లు



**హైదరాబాద్, అక్టోబరు 9:**తెలంగాణలో ఎస్ఐఆర్ కీలక దశకు చేరుకుంది. యువ ఓటర్లు, కొత్తగా అర్హత పొందిన పౌరులతో పాటు విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి కూడా భారీగా దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు అడ్రస్ మార్పులు, పేర్లు, ఇతర వివరాల సవరణ కోసం పెద్ద సంఖ్యలో అభ్యర్థనలు నమోదయ్యాయి. ఓటర్ల పేర్ల తొలగింపుపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎన్నికల అధికారులు పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ జిల్లా నుంచి కొత్త ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య ప్రత్యేకంగా గణనీయంగా ఉంది. అనంతరం నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫామ్-6 దరఖాస్తులు అందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్-6ఎ దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు వంటి అంశాల కోసం 5,04,782 ఫామ్-8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనల కోసం ఫామ్-7లు కూడా వేల సంఖ్యలో వచ్చాయి.ఫామ్-7 ద్వారా ఇప్పటికే ఉన్న ఓటరు పేరును తొలగించాలన్న అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనను దాఖలు చేయవచ్చు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7వ తేదీతో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి నవంబర్ 5వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఆ తర్వాత నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ముందుగానే ప్రకటించింది.జిల్లాల వారీగా చూస్తే కొత్త ఓటు నమోదు కోసం అత్యధిక దరఖాస్తులు హైదరాబాద్ జిల్లా నుంచి వచ్చినట్లు ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 1,93,135 ఫామ్-6 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 29,226 దరఖాస్తులు ఇప్పటికే ఆమోదం పొందినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ జిల్లా నుంచి 4,127 మంది ఎన్ఆర్ఐలు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 ఫామ్-8 దరఖాస్తులు అందాయిఓటర్ల తొలగింపు అంశంలో హైదరాబాద్ జిల్లా కూడా చర్చనీయాంశంగా మారింది. ఫామ్-7ల దాఖలాపై హైదరాబాద్ నగరంలో రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఇటీవల బల్క్‌గా సమర్పించిన ప్రీ-ఫిల్డ్ ఫామ్-7ల వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉందని తాజా రిపోర్టులు సూచిస్తున్నాయి. ఇప్పటికే కోట్లాది మంది ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. నవంబర్ 9వ తేదీన వెలువడే తుది జాబితాతో రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ వివరాల్లో మార్పులు కోరినవారు తుది జాబితా ప్రచురణ తర్వాత.. తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు.

## అర్ధరాత్రి ట్యాంక్‌బండ్‌పై బర్త్‌డే సెలబ్రేషన్స్ వద్దు!



**హైదరాబాద్ అక్టోబరు 9:**ట్యాంక్‌బండ్‌తో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి వేళ పుట్టినరోజు వేడుకలు, కేక్ కటింగ్‌లు చేయవద్దని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ విషయంపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. సంతోషంగా జరుపుకోవాల్సిన పుట్టినరోజు వేడుకలు క్షణికావేశం, నిర్లక్ష్యం వల్ల కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగులుస్తున్నాయని, జీవితాంతం మిమ్మల్ని ఆ విషయాలు వెంటాడుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ట్యాంక్‌బండ్‌పై ఎలాంటి వేడుకలు నిర్వహించడంపై గతంలోనే జీహెచ్ఎంసీ (+నవీజ) స్పష్టమైన నిషేధ ఉత్తర్వులు జారీ చేసిందని సీపీ సజ్జనార్ గుర్తుచేశారు.రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 6 సంవత్సరాల చిన్నారి పుట్టినరోజు నాడే ఆ పాపతో పాటు ఓ కుటుంబసభ్యుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తనతో పాటు పోలీసులను ఎంతో కలిచివేసిందని సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిని వారిని ఆస్పత్రికి తరలించి కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం రాలేదన్నారు. హైదరాబాద్‌లో భవిష్యత్తులో ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ట్యాంక్ బండ్‌పై ప్రమాద స్థలాన్ని పరిశీలించి, ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు.పుట్టినరోజు అనేది వ్యక్తిగత వేడుక కనుక, దానిని ఇళ్ల వద్ద లేదా సురక్షితమైన ప్రదేశాల్లోనే సెలబ్రేట్ చేసుకోవాలని ఐపీఎస్ సజ్జనార్ స్పష్టం చేశారు. అర్ధరాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉండటం వల్ల వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకొస్తుంటాయి. అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటపెట్టుకుని నడిరోడ్డుపైకి రావడం అంత సేఫ్ కాదని ప్రజలకు ఆయన సూచించారు. పోలీసులు నిరంతరం పహారా కాస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, అర్ధరాత్రి వేళల్లో సీక్రెట్‌గా రోడ్లపైకి వచ్చి వేడుకలు చేసుకోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. బర్త్ డే సమయంలో మీరు క్షణికానందం కోసం అమూల్యమైన ప్రాణాలను పణంగా పెట్టవద్దని హైదరాబాద్ ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీలో పటిష్ట బందోబస్తు

**న్యూఢిల్లీ:**దేశ రాజధాని ఢిల్లీలో వరుస అందోళనలు జరుగుతున్న నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం చేసారు. నాలుగు రోజులుగా ఇండియా కూటమి ఆందోళనలతో నగరం స్తంభిస్తుంది. శనివారం జంతర్ మంతర్ లో సిజెపి , వామపక్ష విద్యార్థి సంఘాలనిరసన జరగనుంది. ఇండియా కూటమి, సిజెపి, వామపక్ష విద్యార్థి సంఘాల ఆందోళనల నేపథ్యంలో వేలాది భద్రతా బలగాల మోహరింపు సిద్ధం చేసారు. శనివారం ఢిల్లీలోకి దాదాపు 50 వేల మంది ప్రవేశించే అవకాశం ఉందని సెంట్రల్ ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. దాంతో ఢిల్లీ పోలీసులకు అదనంగా దాదాపు 26 వేల మంది సాయుధ బలగాల మోహరింపు సిద్ధం చేసారు. బెంగాల్, చత్తీస్గడ్ నుంచి వెంటనే ఢిల్లీకి వెళ్లేలా 7000 మంది సీఆర్పీఎఫ్ బలగాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు ఇచ్చింది. జంతర్ మంతర్ సహా మధ్య ఢిల్లీలోని సమస్య త్మక ప్రాంతాల్లోకి ఎవరిని అనుమతించేది లేదని పోలీసులు అంటున్నారు. ఢిల్లీలోకి ప్రవేశించే అన్ని సరిహద్దు మార్గాల్లోనూ చెక్పోస్టుల ఏర్పాటు చేసారు. 12వ తేదీ వరకు దాదాపు 26 వేల మంది సాయి దళాల సిబ్బంది ఢిల్లీ పోలీసులకు అదనంగా ఇప్పటికే ఢిల్లీలో వివిధ ప్రాంతాల్లో దాదాపు 5,000 మంది వెల్లి పోలీస్ సిబ్బంది పహారా నిర్వహిస్తున్నారు. జంతర్ మంతర్ పార్లమెంటు వైపు వెళ్లే అన్ని మార్గాల్లోనూ మల్టీ లేయర్ బారికేట్స్ ఏర్పాటు చేసారు. సెంట్రల్ ఢిల్లీలోని మద్యం దుకాణాలన్నింటినీ మూసివేసేయాల్సిందిగా ఢిల్లీ ఎక్సైజ్ శాఖకు పోలీసులు లేఖ రాసారు.

## నీటికుంటలో పడి ముగ్గురు మృతి

**సంగారెడ్డి:**సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయవిదారక ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మనూరు గ్రామ శివారులోని నీటి వనరు వద్దకు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బట్టలు ఉతకడానికి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఒకరి తర్వాత ఒకరు నీటిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు, సహాయక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు.

## పది సంవత్సరాలు పరిపాలించిన

# టిఆర్ఎస్ ప్రజల కోసం చేసింది ఏమీ లేదు

**అమ్రాబాద్ మండల పార్టీ అధ్యక్షులు ఎమ్మే రహీం**

**అమ్రాబాద్ అక్టోబర్ 9 స్కై న్యూస్** అమరాబాద్ మండలంలో ఈరోజు జరిగిన కాంగ్రెస్ మండల ఆఫీసులో మండల అధ్యక్షుడు రహీం అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిఆర్ఎస్ పార్టీని వారు మాట్లాడే మాటలను తీవ్రంగా ఖండించారు 10 సంవత్సరాల పరిపాలనలు ప్రజలకు టిఆర్ఎస్ పార్టీ చేసింది ఏమీ లేదని ఫార్మర్ తమ కుటుంబ ఆస్తులు పెంచుకోవడం తప్పప్రజలకు ఉపయోగపడే పనులు ఏమి చేయలేదని ప్రాజెక్టులు కడితే కమిషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టులు పగిలిపోతున్నాయని కాంగ్రెస్ హయములఎప్పుడో కట్టిన నాగార్జునసాగర్ శ్రీశైలం ప్రాజెక్ట్ చెదిరిపోకుండా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు 10 సంవత్సరాలు టిఆర్ఎస్ పార్టీ ఎన్నో కుంభకోణాల్లో చిక్కుకున్నదని ఫీల్ మాస్టారు కూడా వదలకుండా వారి సీక్రెట్ ఫోనులు ప్రతిపక్ష పార్టీల ఫోన్లు ట్యాప్ చేశారని ఎన్నో దారుణమైన పనులు చేసి ఈరోజు స్వచ్ఛమైన పాలకులుగా ముందుకు వస్తున్నారని వారికి వచ్చిన వేల ఎకరాల పొలాలు పామోదులు హోటల్లు ఎక్కడ చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు




ఐదు సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలు చెప్పిన ప్రకారం లేడీస్ బస్సులు ఫ్రీ చేసిందని అలాగే బీద ప్రజలకు వ్యవసాయదారులకు కరెంటు ఫ్రీ ఇచ్చిందని ఆర్టీసీ ప్రభుత్వ ఆస్తిగా కలుపుభూతున్నదని వర్కర్స్ ఎంతో సంబరపడిపోతున్నారని ఆయన తెలిపారు నిన్న డొక్కు స్కూటర్పై తిరిగిన కేసిఆర్ కు అన్ని ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నిలదీస్తుందని తెలిపారు ఓట్లను కూడా బ్యాలెట్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు ఇద్దరు కేటీఆర్ అలాగే హరీష్ రావు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం పత్రికల్లోలకు ఎక్కి రోజు ఒక స్టేట్మెంట్ ఇస్తున్నారని వాస్తవాన్ని ప్రజలు గమనిస్తున్నారని వీరి ఆటలు ఎన్నో రోజులు సాగమని వచ్చే ఎన్నికలలో సమాప్తం అయిపోతుందని ఆయన అన్నారు పది సంవత్సరాలు డబుల్ బెడ్ రూములు ఏ గ్రామానికి కూడా అంత లేదని కాంగ్రెస్ పాలల్లో ప్రతి గ్రామాల్లో డబుల్ బెడ్ రూములు పుష్కలంగా ఇస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు లేని వారు ఉండకూడదని దృక్పథంతో పనిచేస్తున్నామని అలాగే ఓటు ఎస్సార్ సవరణలు ఏమాత్రం అవనీతి జరిగినట్లు అయితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదనిప్రతి మాట ఎన్నికల టైములో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నామని అధ్యక్షులు అబ్దుల్ రహీం అన్నారు ఈ కార్యక్రమంలో సంబు వెంకటరమణ ఉప సర్పంచ్ గౌడ్ మరియు బీసీ సెల్ గౌడ్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

**సింగిల్ విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 9 (స్కై న్యూస్):** పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని సింగిల్ విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇంటిలో లబ్ధిదారుడు ఎండీ ఖదీర్ కుటుంబం గురువారం గృహప్రవేశం చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చల్లా శ్రీకాంత్ రెడ్డి గ్రామ సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ అశోక్‌తో కలిసి పూజా కార్యక్రమాలు





నిర్వహించి లబ్ధిదారుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో తొలి విడతలో 25 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అనేక ఇళ్ల నిర్మాణాలు 80 శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటికే నాలుగు ఇళ్లలో గృహప్రవేశాలు జరిగాయని వెల్లడించారు. పేదలకు ఇళ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జోగులాంబ గద్వాలను ఇచ్చిన

# ఘనత కెసిఆర్‌దే

**గద్వాల జిల్లా ఏర్పాటుచేసి పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు**

**5కే రన్ తో జిల్లా కేంద్రంలో కేసీఆర్ కి ధన్యవాదములు కార్యక్రమం**

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 9 (స్కై న్యూస్):**గద్వాలలో దశాబ్ది కార్యక్రమాల్లో భాగంగా 5 కె రన్ ప్రారంభించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు,రాష్ట్ర నాయకులు మరియు జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య గద్వాల జిల్లా కేంద్రంలోని తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాట్లు భాగంగా కేసీఆర్ గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు లిదశాబ్ది కార్యక్రమాల్లో భాగంగా 5 కె రన్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి బాసు హనుమంతు నాయుడు ప్రారంభించారు. అనంతరంపాత బస్టాండ్, కృష్ణవేణి చౌక్,అంబేద్కర్ చౌక్ మీదుగా వైయస్సార్ చౌక్ వరకు యువతతో కలిసి,5 కె రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఇంతటి ఉత్సాహభరితమైన వాతావరణంలో, మీ అందరి మధ్య ఈ 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తుర్తయోంది అని అన్నారు.గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి అభివృద్ధి పథకంలో నడిపిన కేసీఆర్ గారికి రుణపడి ఉంటామని అని అన్నారు..గద్వాల జిల్లాను ఏర్పాటు చేయడమే కాకుండా జిల్లాకు నూతన కలెక్టరేట్,మెడికల్ కాలేజ్,నర్సింగ్ కాలేజ్, ఎస్పీ ఆఫీస్ ఇలాంటి మరెన్నో కార్యక్రమాలను చేసి జిల్లాను మరింత అభివృద్ధి కెసిఆర్ గారు ప్రభుత్వంలో చేశారు అని గుర్తు చేశారు."ఆరోగ్యమే మహాభాగ్యం" అని మన పెద్దలు ఊరికే అనలేదు. ఈ రోజుల్లో మారుతున్న జీవనశైలి, ఒత్తిడి వల్ల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తగ్గడం మనం చూస్తూనే ఉన్నాం. ఉరుకుల పరుగుల జీవితంలో మన శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం ఎంతో ముఖ్యం. ఈ 5 కే రన్ కేవలం ఒక పరుగు మాత్రమే కాదు... ఇది మన ఆరోగ్యం పట్ల మనకు ఉన్న బాధ్యతకు, అవగాహనకు ఒక ప్రతీక అని తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి, పది ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఇంత అద్భుతంగా నిర్వహించిన నిర్వాహకులకు, స్వచ్ఛంద సేవకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర



రెడ్డి, కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, సంటెన్న,జగదీష్, దుబన్న,గువ్వల గోపాల్, నరసింహులు,మోహన్ యాదవ్,చిత్తరి కిరణ్,కమ్మరి రాము,రామకృష్ణ,కోటేష్, బీచుపల్లి,వెంకటేష్ నాయుడు, జాంపల్లి భరత్ సింహారెడ్డి,వినయ్,శేఖర్ నాయుడు,రాముడు,శ్రీరాములు, ముని మౌర్య,మాలిక్,నవీన్, అరవింద్,రాము,తిమ్మప్ప, మహేష్, లక్ష్మణ, రంగస్వామి, రాఘవేంద్ర, ప్రవీణ్,అశోక్,మరియు నాయకులు యువత తదితరులు పాల్గొన్నారు....

## ఎమ్మెల్సీ ఎన్నికలలో

# కాంగ్రెస్ కే పట్టం కట్టాలి...

**టీజేఎస్ జిల్లా అధ్యక్షులు మోసలి శ్యాంప్రసాద్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 9( స్కైన్యూస్)** మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలో రాబోయే శాసన మండలి ఎన్నికలలో నిరుద్యోగ యువత విద్యార్థులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డి కి అండగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు మోసలి శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు పార్టీ అభ్యర్థిని ఆయన నివాస గృహంలో కలిసి ఉమ్మడి పాలమూరు జిల్లా ఎన్నికలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ముసలి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే పట్టా బద్రుల ఎన్నికలలో విద్యార్థి యువత సమస్యలపై విస్తృత అవగాహన కలిగిన ఆయన గెలుపు వల్ల ఉమ్మడి పాలమూరు జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడంతోపాటు ఎంతో ఉద్యమ చరిత్ర ఆయనకు ఉందని అన్నారు యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా టీపీసీసీ ప్రచార చైర్మన్గా పార్టీ లీగల్ సెల్లో పనిచేసిన అనుభవం ఉందని అన్నారు. విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన గెలుపుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఈ ప్రాంతం వెనకబడిపోయిందని గుర్తు చేశారు. ఎన్నికలలో కాంగ్రెస్ ను గెలిపించడం ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు ప్రతి ఓటరు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు



## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 9 (స్కై న్యూస్):** షాద్‌నగర్‌లోని గాంధీనగర్ కాలనీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు, ఆటలతో సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి. నవీన్ కుమార్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు, ఐకమత్యానికి ప్రతీక అని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ సత్తార్ సర్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, డైరెక్టర్ సత్తార్ సర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**ఆమనగల్లు, అక్టోబర్ 09 (స్కై న్యూస్):** ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఏబీఏ) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేశ్, కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా నేనావత్ పవన్ కళ్యాణ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ నాయక్, ప్రసాద్, వెంకటేశ్, పర్వతాలు, గిరి, హీరా సింగ్, రవి టీచర్, గోరటి దేవేందర్, సత్యం సింగ్, గోరటి జంగయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శకతతో

# మెరుగైన సేవలు..

**ప్రజలకు విద్యుత్ సేవలకి ఎలాంటి అంతరాయం కలగకుండా పారదర్శకత తో సేవలు అందిస్తాము...**

**ఎస్ ఈ విజయేందర్ రెడ్డి**

**కరీంనగర్ అక్టోబర్08 ( స్కై న్యూస్)**తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి 11 కేవీ స్థాయిలో అర్హత కలిగిన హై టెన్షన్ (ఃు) విద్యుత్ కనెక్షన్లు, అదనపు లోడ్లకు ఏకరీతి సర్వీస్ లైన్ ఛార్జీలను అమలు చేసే విధానం అందుబాటులోకి తీసుకొచ్చిందని కరీంనగర్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఏ విజయేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ ఈ మాట్లాడుతూ "లైసెన్సీస్ డ్యూటీ ఫర్ సప్లై ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఆన్ రిక్వెస్ట్"నిబంధనలకు చేసిన మూడవ సవరణగా రెగ్యులేషన్ నం. 07 ఆఫ్ 2026ను టిజి ఈఆర్సీ జారీ చేసిందన్నారు. ఈ సవరణ ద్వారా అర్హత కలిగిన 11 కేవీ హై టెన్షన్ వినియోగదారులకు సర్వీస్ లైన్ ఛార్జీల విషయంలో స్పష్టమైన, ఏకరీతి విధానం ద్వారా మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. అంతేకాకుండా...పారదర్శకత, జవాబుదారీతనం, సామర్థ్యం, వినియోగదారుల కేంద్రిత సేవలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగదారులకు సులభతరమైన, వేగవంతమైన విద్యుత్ సేవలు అందించే దిశగా నిరంతరం చర్యలు చేపడుతోందని,వినియోగదారులకు మరింత స్పష్టత కొత్త నిబంధనల ప్రకారం, ఇప్పటికే ఉన్న 11 కేవీ విద్యుదీకరించిన కామన్ ఫీడర్ నుంచి ఓవర్‌హెడ్ లైన్ ద్వారా 1 కిలోమీటర్ పరిధిలో ఉన్న 11 కేవీ హై టెన్షన్ కొత్త కనెక్షన్లు, అదనపు లోడ్లకుసరఫరా కల్పించుటకు ప్రతి కె వి ఏ కాంట్రాక్టెడ్ డిమాండ్‌కు ?4,078 సర్వీస్ లైన్ ఛార్జీ వర్తిస్తుందన్నారు.దీంతో అర్హత కలిగిన వినియోగదారులకు సర్వీస్ లైన్ వ్యయంపై ముందుగానే స్పష్టత లభించడంతో పాటు, దరఖాస్తుల పరిశీలన, ప్రాసెసింగ్‌లో మరింత ఏకరూపత ఏర్పడుతుందని వివరించారు.గతంలో 11 కేవీ స్థాయిలో స్థల పరిశీలన, సాంకేతిక అంచనాల ఆధారంగా సర్వీస్ లైన్ వ్యయాన్ని నిర్ణయించాల్సి ఉండేదని, కొత్త విధానం అమలుతో అర్హత కలిగిన సర్వీసులలో అంచనాలపై ఆధారపడే అవసరం తగ్గి, దరఖాస్తుల ప్రాసెసింగ్ మరింత సరళంగా, వేగవంతంగా జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు .

**పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రయోజనం**




ఈ విధానం వల్ల పారిశ్రామిక, వాణిజ్య, ఐటీ తదితర రంగాల్లో కొత్త విద్యుత్ కనెక్షన్లు లేదా అదనపు లోడ్ల కోసం దరఖాస్తు చేసే అర్హత కలిగిన వినియోగదారులకు వ్యయంపై ముందస్తు స్పష్టత ఏర్పడుతుందని వివరించారు.విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకత, సమయపాలన పెరగడం ద్వారా వ్యాపారాలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పన మరింత సులభతరం కావడంతో పాటు పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడానికి ఏకరీతి సర్వీస్ లైన్ ఛార్జీలు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు వినియోగదారులకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆధునిక సాంకేతికత, వేగవంతమైన సేవల ద్వారా నాణ్యమైన విద్యుత్ సేవలను అందించేందుకు ఎస్ఈ తెలిపారు..

## పంటల పరిశీలన, చీడపీడల నివారణపై రైతులకు శాస్త్రీయ సూచనలు...



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 9(స్కై న్యూస్,):**జిల్లాలోని యెర్రవల్లి, గద్వాల మండలాల పరిధిలోని బీచుపల్లి, అనాతపురం, పూడూరు, కొండపల్లి గ్రామాల్లో ఈరోజు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం గద్వాల సమన్వయకర్త డాక్టర్ పి. అర్చన, =ూ=ూ శాస్త్రవేత్తలు శ్రీ ఎ. శ్రీరామ్, డాక్టర్ కె. మమత, డాక్టర్ జి. మాధురితో కలిసి పంటల క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, మిరప, కంది, బెండ, పత్తి పంటలను పరిశీలించి, పంటల ఎదుగుదల, చీడపీడల ఉధృతి, రైతులు అనుసరిస్తున్న యాజమాన్య పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. పి. అర్చన రైతులతో మాట్లాడి పంటల సమస్యలపై శాస్త్రీయ సూచనలు అందించారు. పత్తి: పత్తి పంట కోత దశలో ఉన్నట్లు గుర్తించారు. కొన్ని పొలాల్లో గులాబీ రంగు కాయతొలుచు పురుగు (పింక్ బోల్‌వార్మ్) ఉనికిని గమనించారు. పంట పరిపక్వత, పొలాల పరిస్థితులను బట్టి నవంబర్ మొదటి పక్షం నాటికి మిగిలిన పత్తి కోత పనులను పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. మిరప: బిందు సేద్యం ద్వారా సాగు చేస్తున్న మిరప పంటలో ఆకులు పైపైపుకు ముడుచుకునే లక్షణాలను గమనించారు. తామర పురుగుల నివారణకు ఇప్పటికే ఏడు సార్లు మందులు పిచికారీ చేశామని, ప్రస్తుతం పురుగుల ఉధృతి సమర్థవంతంగా తగ్గిందని రైతులు తెలిపారు. బెండ: సుమారు రెండు నెలల వయస్సు కలిగిన బెండ పంటలో 43వ కోత దశను గమనించారు. కాయతొలుచు పురుగు నివారణకు రైతు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును పిచికారీ చేసినట్లు తెలిపారు. వరి: వరి పంట క్రియాశీల పిలకల దశలో ఉంది. పంటలో పానికిల్ మైట్ (వెన్ను/కంకి మైట్) సమస్యను గుర్తించారు. పురుగు లక్షణాలను నిర్ధారించిన తరువాత వరి పంటకు అనుమతించబడిన తగిన పురుగుమందును లేబుల్ సూచనల ప్రకారం మాత్రమే ఉపయోగించాలని శాస్త్రవేత్తలు సూచించారు. అలాగే కంది పంటను కూడా పరిశీలించి, పంట ఎదుగుదల మరియు ఆరోగ్య పరిస్థితులను అంచనా వేశారు. ఈ క్షేత్ర సందర్శనలో మొత్తం ఐదుగురు రైతులు పాల్గొన్నారు. పంటల్లో చీడపీడల గుర్తింపు, నివారణ చర్యలు, శాస్త్రీయ పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు.

# అప్రమత్తతతో సైబర్ మోసాలను అరికట్టాలి...

**ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**




**నాగర్ కర్నూల్ అక్టోబర్ 9( స్కై న్యూస్)** ప్రతి ఒక్కరు సైబర్ మోసాలకు మోసపోకుండా ఉండేందుకు అవగాహన ఎంతో కీలకమైన మోసాలను అరికట్టేందుకు పోలీసు శాఖకు యువత సహకరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ కోరారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో అవగాహన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆలోచించి ఆన్లైన్ వ్యాపారాలు నిర్వహించాలని సాంకేతికత పెరుగుతున్న విధంగానే సైబర్ మోసాలు కూడా పెరుగుతున్నాయని వాటిని అడ్డుకునేందుకు జిల్లా పోలీసు శాఖ ఇప్పటికే అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇంటి వద్ద ఉంటూనే సులభంగా డబ్బు సంపాదించవచ్చని పార్ట్ టైం ఉద్యోగాలు అంటూ సామాజిక మాధ్యమాలలో వచ్చే ప్రకటనలను నమ్మవద్దని సూచించారు. ఫేక్ రీడింగ్ యాప్ వల్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచి ఒక వ్యక్తుల నుండి వచ్చే లింక్ లను క్లిక్ చేయవద్దని బ్యాంకు వివరాలను మరియు ఓటీపీని ఎవరితో వద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైకే వెంటనే ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలని వివరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నోముల వెంకటేశ్వర్లు సైబర్ క్రైమ్ ఎస్సై గిరి మనోహర్ రెడ్డి స్పెషల్ బ్రాంచ్ ఎస్సై శ్రీనివాస్ జిల్లా సైబర్ క్రైమ్ టీం సభ్యులు తేజశ్రీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

# షాద్‌నగర్ చీలిపోతుందా?

**మూడు మండలాలు కొత్త నియోజకవర్గంలోకి?**

**ఏసీపీ కార్యాలయంతో పెరిగిన ఊహాగానాలు.. అయోమయంలో రాజకీయ నేతలు!**




**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 9 (స్కై న్యూస్):** ఆరు మండలాలతో విస్తరించిన షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం రెండుగా విడిపోనుందా? కొత్తూరు, నందిగామ, కేశంపేట మండలాలు కొత్తగా ఏర్పడే శంషాబాద్ లేదా ఆమనగల్ నియోజకవర్గంలో కలవనున్నాయా? ప్రస్తుతం ఈ అంశాలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కొత్తూరులో ప్రత్యేక ఏసీపీ కార్యాలయం ఏర్పాటు కావడంతో ఈ ఊహాగానాలు మరింత పెరిగాయి. అయితే నియోజకవర్గాల పునర్విభజనపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. 1952లో ఏర్పడిన షాద్‌నగర్ నియోజకవర్గం ప్రస్తుతం ఫరూక్‌నగర్, కొందుర్గు, కేశంపేట, కొత్తూరు, నందిగామ, జిల్లేడు చౌదరిగూడ మండలాలతో కొనసాగుతోంది. ప్రచారంలో ఉన్న ప్రతిపాదనల ప్రకారం కొత్తూరు, నందిగామ, కేశంపేట మండలాలు మరో నియోజకవర్గంలోకి వెళ్తే, షాద్‌నగర్ పరిధిలో మిగిలిన మూడు మండలాలే ఉండే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ఫరూక్‌నగర్ మండలంలోని మొగిలిగిద్దను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా ప్రస్తావనకు వస్తోంది. నియోజకవర్గాల విభజన జరిగితే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీజేపీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి వంటి నేతల రాజకీయ సమీకరణాలపై ప్రభావం పడవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆయా నాయకుల స్వగ్రామాలు కొత్త నియోజకవర్గ పరిధిలోకి వెళ్తే వారి రాజకీయ వ్యూహాలు మారే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అయితే కొత్తూరు ఏసీపీ కార్యాలయం ఏర్పాటు, నియోజకవర్గాల పునర్విభజనకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు అధికారిక సమాచారం లేదు. పునర్విభజనపై స్పష్టత వచ్చే వరకు ఈ వార్తలను ఊహాగానాలుగానే చూడాల్సి ఉంటుంది. షాద్‌నగర్ నియోజకవర్గ భవిష్యత్తుపై అధికారిక ప్రకటన ఎప్పుడు వెలువడుతుందోనన్న ఆసక్తి స్థానిక రాజకీయ వర్గాల్లో నెలకొంది.

# గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు కేఎల్ఎన్ యువసేన శ్రీకారం

**డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి**



**కోదాడ, అక్టోబర్ 9 (స్కై న్యూస్):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదును వేగవంతం చేసేందుకు కౌండిన్య గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం జాతీయ అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ పిలుపు మేరకు కేఎల్ఎన్ యువసేన మిత్రమండలి ప్రతినిధులు కోదాడ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ డిగ్రీ పూర్తి చేసిన యువతను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలు, వివిధ ప్రాంతాల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి స్వయంగా దరఖాస్తు ఫారాలు నింపడంతో పాటు ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు నమోదు చేసే ప్రక్రియలో సహకరిస్తున్నారు. కౌండిన్య గౌడ సంఘం ఆధ్వర్యంలో మూడు జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు సహాయం అవసరమైతే సంఘం ప్రతినిధులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కారింగుల శ్రీనివాస్ గౌడ్, మద్దికుంట్ల సైదులు, పులి వెంకటేశ్వర్లు, వట్టికూటి శ్రీనివాస్ గౌడ్, బచ్చలకూరి గురువయ్య, బత్తిని సాయి తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి-సిఐ వేణుగోపాలరావు



**ఆమనగల్లు, అక్టోబర్ 9(స్కై న్యూస్):**నేరాల నియంత్రణకు గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మాడ్గుల సిఐ వేణుగోపాలరావు సూచించారు. మండల పరిధిలోని సుద్ధపల్లి గ్రామంలో దాత కళ్లెం వెంకటేశ్వర్ రెడ్డి ఒక లక్ష రూపాయలతో ఏర్పాటు చేసిన సిటీ కేంద్రాలను సర్పంచ్ కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని అందుకోసం నేరాల నియంత్రణకు మండలంలోని ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సిసి కెమెరాల ఏర్పాటుకు విరాళం అందించిన దాతకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాఘవేందర్, ఉప సర్పంచ్ శ్రీను, నాయకులు దేవరకొండ శ్రీనివాస్, జగన్ చారి, మహేష్, కార్యదర్శి అశోక్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఏర్పాట్లపై భగ్గుమన్న బీ ఆర్ ఎస్....

**నగరపాలక సంస్థ ముట్టడికి యత్నం..పలువురికి గాయాలు.. కార్యకర్తల అరెస్టు**







**కరీంనగర్ అక్టోబర్ 08( స్కై న్యూస్ ):**బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో నగరపాలక సంస్థ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం కరీంనగర్ బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయ ముట్టడికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వానికి మరియు నగరపాలక సంస్థ అధికారులకు,పాలకవర్గానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో పలువురు కిందపడి గాయాలపాలయ్యారు. అనంతరం పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేసి పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి తరలించారు.

**పండుగల నిర్వహణలో నిర్లక్ష్యమెందుకు?**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ, దసరా, ఉగాది తదితర పండుగలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసేదని పేర్కొన్నారు. పండుగలకు నెల రోజుల ముందే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి ప్రజలు, ముఖ్యంగా మహిళలు, ఆడపడుచులు సంతోషంగా వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకునేవారని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పండుగల నిర్వహణపై నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శించారు.

**ముందస్తు ప్రణాళిక ఏదీ?**

జనవరిలోనే విడుదలయ్యే క్యాలెండర్‌లో బతుకమ్మ, దసరా, రంజాన్, ఇతర పండుగల తేదీలు స్పష్టంగా ఉంటాయని, అలాంటప్పుడు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. పండుగ సమీపించిన తర్వాత టెండర్లు నిర్వహించడం వల్ల ఏర్పాట్లలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యే సమయానికి కూడా అవసరమైన ఏర్పాట్లు పూర్తి కాకపోవడం నగరపాలక సంస్థ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.

**చీకట్లో బతుకమ్మ ఆడాలా?**

తెలంగాణ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగకు నగరంలో సరైన ఏర్పాట్లు లేకపోవడంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని వీధి దీపాలు సరిగా వెలగకపోతే మహిళలు చీకట్లోనే బతుకమ్మ వేడుకలు జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో పనిచేయని వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేసి, అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హిందువుల పండుగల నిర్వహణలో నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించిన నేతలు.. బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగల నిర్వహణలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**కలెక్టర్ చొరవ తీసుకోవాలి**

కరీంనగర్ నగరపాలక సంస్థ అధికారులపై ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి మూడు రోజుల్లోగా పండుగ ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. వీధి దీపాలు, పారిశుద్ధ్యం, పండుగ నిర్వహణకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను వెంటనే సిద్ధం చేయాలని కోరాయి. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ, దసరా పండుగలను ఆనందంగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశాయి.పండుగ ఏర్పాట్లలో నిర్లక్ష్యం కొనసాగితే ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ప్రజల పండుగలను రాజకీయాలకు అతీతంగా ఘనంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు నగరపాలక సంస్థపై ఉందని పేర్కొన్నారు.....ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ , మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ , కార్పొరేటర్ లు గుగ్గిళ్ల జయశ్రీ , జమ్మూ , యూసుఫ్, నలువాల రవీందర్ , గాదె రూపా శ్రీనివాస్ , ప్రదీప్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ లు గందె మాదవీ మహేష్, జంగిలి ఇలెందర్ యాదవ్ , ఎడ్ల సరిత అశోక్ , సోనూ సింగ్, కర్ర సూర్య శేఖర్ , గంటల రేణుక , తదితరులు పాల్గొన్నారు

# విజ్ఞాన్ హైస్కూల్లో ఘనంగా బతుకమ్మ, దసరా వేడుకలు

**విజ్ఞాన్ హైస్కూల్ లో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన**

**వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపల్ వి. మహేందర్, డాక్టర్ పి. శ్వేతారాము, డాక్టర్ శారద, అడ్వకేట్ ఎన్. ప్రియాంక**







**ఆమనగల్లు, అక్టోబర్ 09 (స్కై న్యూస్):**ఆమనగల్లు పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్ లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ, దసరా వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆమనగల్లు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై, రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది.

**సంస్కృతి, విలువలు తెలియజేయడమే లక్ష్యం – ప్రిన్సిపాల్ మహేందర్**

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వి. మహేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను తెలియజేయడం ఎంతో ముఖ్యమన్నారు. బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి సూచన అని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజల మధ్య అనుబంధాన్ని పెంపొందించడమే ఇటువంటి వేడుకల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. .కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థుల తల్లులకు, తల్లిదండ్రులకు, ఆమనగల్లు పట్టణ ప్రజలకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి అందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపింది.

# గద్వాలలో ఘనంగా కిసాన్ మేళా...



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 9 (స్కై న్యూస్):**రైతులు ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ప్రకృతి వ్యవసాయంపై ఎక్కువగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, ఆత్మ చైర్మన్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో శుక్రవారం గద్వాలలోని కెఎస్ ఫంక్షన్ హాల్ లో 'కిసాన్ మేళా' పేరుతో వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, రైతులు, శాస్త్రవేత్తలతో సమావేశ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ముందుగా ముఖ్య అతిథులు, ఇతర అతిథిలతో కలిసి వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక, ఉద్యాన, తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్టాల్స్ లో ఏర్పాటు చేసిన ఆయా యంత్రాలను, ఇతర ఉత్పత్తులను రైతులతో కలిసి తిలకించి ప్రశంసించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసి తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రైతులు ప్రతిభావంతులని, ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినప్పటికీ ఎంతో కష్టపడి వివిధ పంటలు సాగు చేయడం అభినందనీయమన్నారు. రైతులు డ్రోన్స్ ను వినియోగించుకోవాలని, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. యూరియా యాప్ ద్వారా రైతులకు యూరియా వాడకంపై అవగాహన కలిగించడం జరిగిందన్నారు. దాంతో హెక్టార్ కు సగటున 500 కేజీల వరకు యూరియా వినియోగాన్ని తగ్గించడంతో జిల్లా వ్యాప్తంగా సుమారుగా 2330 టన్నుల యూరియాను తగ్గించడం జరిగిందన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో జిల్లా రైతుల సంక్షేమానికి అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. జిల్లాలోని పలు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని ప్రభుత్వం పెంచడంతో రానున్న రోజుల్లో సాగు, తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ పంటకు మంచి డిమాండ్ ఉన్నందున ఉమ్మడి జిల్లాలోనే జోగులాంబ గద్వాల జిల్లా రైతులు అత్యధిక ఎకరాల్లో సాగు చేశారని కొనియాడారు. జిల్లాలో పాల ఉత్పత్తి పెరిగేలా ఆవులు, గేదెల పెంపకం చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు, మేకలు పెంచే వారికి ప్రయోజనం చేకూరేలా బీమా పథకాన్ని ప్రవేశపెట్టినందున సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో 80 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున ప్రభుత్వాలు రైతులకు ఎంతో ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఏ పార్టీలు అధికారంలోకి వచ్చినా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పథకాలను పకడ్బందీగా అమలు చేస్తే అన్నదాతలకు మేలు జరుగుతుందన్నారు. వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్తు సరఫరా ఉండాలని, కనీసం 18 గంటలైన ఇవ్వాలన్నారు. రైతుల కష్టానికి తగిన ఫలితం రావాలంటే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, రైతులు బాగుంటేనే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తాయని, ఆయా రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందు చూపు అవసరమని, అధికారులు సకాలంలో సరైన అవగాహన కల్పించడం వలన అన్నదాతలు నష్టపోకుండా ఆరుతడి పంటలు సాగు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలు కూడా రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని పరిశోధనలు చేయాలని, రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత మాట్లాడుతూ సమస్త మానవాళి జీవనాధారానికి మూలం రైతులేనని కొనియాడారు. అన్నదాతలు ఒకప్పుడు పంటలతో పాటు పాడికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చే వారని, రైతులు పాడి పరిశ్రమపై కూడా దృష్టి సారించేలా సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రోత్సహించాలన్నారు. మానవ తప్పిదాలతోనే పర్యావరణంలో కాలుష్యం పెరుగుతోందని అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ ను నిషేధించడమే కాక వాతావరణానికి హాని కలిగించే అన్ని కారకాలపై కొరడా జులిపించాలని ఫలితంగా భవిష్యత్తు తరాల మనుగడకు కృషి చేసిన వారమవుతామన్నారు. వర్షాలు సకాలంలో కురిస్తేనే రైతులు సుభిక్షంగా ఉంటారని, ఫలితంగా అన్ని రంగాలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర వాల్మీకి బోయ కార్పోరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా రైతులకు మేలు జరిగేందుకు ఇటీవలే పలువురు ప్రజాప్రతినిధులు కర్ణాటక ముఖ్యమంత్రిని కలిసి ఆల్మట్టి డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు మూడు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరినట్లు గుర్తు చేశారు. నడిగడ్డను కరువు జిల్లాగా ప్రకటించాలని, అన్నదాతలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఆదర్శ రైతులు ప్రకృతి వ్యవసాయం, ఇతర వినూత్న పద్ధతులతో చేస్తున్న పంటల సాగుపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, డీఏవో వీరప్ప, ఆత్మ డిప్యూటీ పీడీ జగ్గు నాయక్, గద్వాల పిఎసిఎస్ చైర్మన్ సుభాన్, ఇతర ప్రజా ప్రతినిధులు, పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు, నేతలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి దుర్గామాత ఆలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఘన ఆహ్వానం



**ఆమనగల్లు,అక్టోబర్ 09 (స్కై న్యూస్):** తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న దుర్గామాత ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవానికి హాజరుకావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఆహ్వానించారు. శుక్రవారం కల్వకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ సభ్యులు ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ విశిష్టతను, నిర్వహించనున్న పూజా కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు.ఆలయ ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరవుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, మల్లేష్ యాదవ్, గిరిందర్ రెడ్డి, పాండు, శ్రీకాంత్, భరత్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు

**- డీఈ ప్రతాప్ రెడ్డి హెచ్చరిక**



**ఆమనగల్లు, అక్టోబర్ 09 (స్కై న్యూస్):** చెరువులకు, వాటి కట్టలకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. ఆమనగల్లు మున్సిపల్ కేంద్రంలోని సురసముద్రం చెరువు కట్టలో కొంత భాగాన్ని కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తొలగించినట్లు నవదిశ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి, చెరువు కట్ట తొలగింపుపై వివరాలు తెలుసుకున్నారు. తొలగించిన కట్టను తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువుల పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. అదేవిధంగా విటాయిపల్లి పల్లె చెరువును సైతం ప్రతాప్ రెడ్డి పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువు నుంచి మట్టిని తరలించినా, చెరువు పరిరక్షణకు భంగం కలిగించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి...

**స్వేరోస్ జిల్లా కో కన్వీనర్ గిద్ధ విజయ్ కుమార్**



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 9( స్కైన్యూస్)** వైద్య విద్యార్థులకు కనీస మౌలిక వసతులను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్య విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని జిల్లా స్వేరోస్ కో కన్వీనర్ గిద్ధ విజయ్ కుమార్ కోరారు ముఖ్యమంత్రి వద్ద విద్యా శాఖను ఉంచుకోవడం జరిగిందని మంత్రి లేకపోవడం వల్ల రాష్ట్రంలో వైద్య విద్యార్థులు రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారని వివరించారు. వైద్య కళాశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని జగిత్యాల మెడికల్ కళాశాలలో మహిళా విద్యార్థులకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా సౌకర్యాలు లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఆహారం కలుషితం కావడం వల్ల విద్యార్థుల అస్వస్థతకు గురవుతున్నారని కళాశాలలో సరి అయిన భోదనేతర వసతులు లేవని గత మూడు సంవత్సరాలుగా గోదాములో మెడికల్ కళాశాల ను నిర్వహించడం జరుగుతుందని మండిపడ్డారు. వైద్య విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేస్తున్న పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు

## షాద్‌నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**బతుకమ్మ ఆటపాటల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సందడి**



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 9 (స్కై న్యూస్):** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఎస్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ ఛైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ హాజరై బతుకమ్మ ఆటపాటల్లో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, యువత ఉత్సాహంగా జరుపుకున్నారు. బతుకమ్మ పాటలతో బుగ్గారెడ్డి గార్డెన్స్ మారుమోగింది. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర సమన్వయకర్త రఘు నాయక్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

# యువత పొదుపును అలవాటు చేసుకోవాలి



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 9 (స్కై న్యూస్):**యువత బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుంటూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపును అలవాటు చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస రావు అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మెమోరియల్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో యూనియన్ బ్యాంక్ క్లస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలు,పొదుపు, రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు 'యూనియన్ యువ కనెక్ట్ -- బ్యాంకింగ్ ఫర్ యూత్' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పొదుపు ఖాతాలు, కరెంట్ ఖాతాల ప్రారంభ విధానం, బ్యాంకులు అందించే వివిధ డిపాజిట్ పథకాలు,రుణ సదుపాయాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు,బీమా పథకాల గురించి వివరించారు. విద్యార్థులు తమ ఆదాయం, ఖర్చులపై అవగాహన కలిగి ఉండాలని, అవసరాలకు అనుగుణంగా ఖర్చులు చేస్తూ భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు.అలాగే, ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకింగ్ సేవలను సులభంగా, వేగంగా వినియోగించుకునేందుకు అందుబాటులో ఉన్న డిజిటల్ బ్యాంకింగ్ సదుపాయాలు, యూనియన్ ఈజ్ వంటి డిజిటల్ సేవల వినియోగంపై అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని వివరించారు. ఆర్థిక అక్షరాస్యత ప్రతి ఒక్కరికీ అవసరమని, బ్యాంకింగ్ సేవలపై సరైన అవగాహన కలిగి ఉండటం ద్వారా పొదుపును పెంపొందించుకోవడంతో పాటు ఆర్థిక భద్రతను సాధించవచ్చని పేర్కొన్నారు. యువత బ్యాంకులు అందించే సేవలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నార.

## ఆర్టీసీని, కార్మికుల భవిష్యత్తును కాపాడుకోవాలంటే ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించండి!

**బస్సు గుర్తుకు ఓటేయండి -- టీఎంయూ నిచ్చెన గుర్తుతో కూటమిని గెలిపించండి**

**సిపిఐ జిల్లా కార్యదర్శిడఎంప్లాయిస్ యూనియన్ గద్వాల డిపో చైర్మన్ బి. ఆంజనేయులు విజ్ఞప్తి**

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 9(స్కై న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ఈరోజు జరుగుతున్న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించి, ఆర్టీసీ సంస్థను, కార్మికుల భవిష్యత్తును కాపాడుకోవాలని సిపిఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శి, ఎంప్లాయిస్ యూనియన్ గద్వాల డిపో చైర్మన్ బి. ఆంజనేయులు ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గద్వాల డిపో ఎదుట కార్మికులను కలిసి ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్‌కు మద్దతుగా ఓటు వేయాలని కోరారు.ఆర్టీసీ కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం పోరాడే సంఘాలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి గుర్తింపు కోసం పోటీ చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుకు, ప్రాంతీయ స్థాయి గుర్తింపు కోసం ఎంప్లాయిస్ యూనియన్‌తో కూటమిగా పోటీ చేస్తున్న టీఎంయూ నిచ్చెన గుర్తుకు ఓటు వేసి కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యతే బలం అని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని కార్మికుల హక్కులను పరిరక్షించుకునేందుకు ముందుకు రావాలని బి. ఆంజనేయులు తో కలసి ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ మాజీ కార్యదర్శి బసన్న , యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేశ్వరయ్య, మాజీ డిపో సెక్రటరీ కేకే రెడ్డి, రీజినల్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, డిపో అధ్యక్ష కార్యదర్శులు గాల్ రెడ్డి గిరిరాజు ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రంగన్న లు కోరారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ గద్వాల డిపో నాయకులు సీనియర్ నాయకులు శ్రీధర్ రావు రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్నాథ్, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు భాస్కర్ రాములు, సూరిబాబు, దస్తగిరి తదితరులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.



## మొయినాబాద్ క్రిమినల్ కేసులు చేవెళ్ల కోర్టుకు బదిలీ.. ప్రజల్లో హర్షం




**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 9 (స్కై న్యూస్):** సమయం, ఖర్చు ఆదా అవుతుండటంపై ప్రజల సంతోషం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిమినల్ కేసులను చేవెళ్ల కోర్టు పరిధిలోకి మార్చడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మొయినాబాద్‌కు సంబంధించిన సివిల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఎక్సైజ్ (అబ్కారీ) కేసులు చేవెళ్ల కోర్టు పరిధిలో ఉండగా, క్రిమినల్ కేసులు మాత్రం రాజేంద్రనగర్ కోర్టు పరిధిలో ఉండేవి. దీంతో ఒకే వ్యక్తికి సంబంధించిన వేర్వేరు కేసుల కోసం రెండు ప్రాంతాల్లోని కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ కారణంగా క్రిమినల్ కేసుల కోసం రాజేంద్రనగర్ కోర్టుకు, సివిల్ మరియు ఇతర కేసుల కోసం చేవెళ్ల కోర్టుకు వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల ప్రజలు వేర్వేరు న్యాయవాదులను నియమించుకోవాల్సి రావడంతో ఆర్థిక భారం పెరగడమే కాకుండా, ప్రయాణానికి ఎక్కువ సమయం కూడా వెచ్చించాల్సి వచ్చేది. తాజాగా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిమినల్ కేసులను కూడా చేవెళ్ల కోర్టు పరిధిలోకి మార్చడంతో ప్రజలకు ఎంతో ఊరట లభించింది. ఇకపై ఒకే కోర్టు పరిధిలో కేసులకు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాలను నిర్వహించుకునే అవకాశం కలగడంతో సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రజా రవాణాపై ఆధారపడే వారికి ఈ మార్పు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. చేవెళ్ల కోర్టుకు వెళ్లేందుకు సాధారణంగా ఒకే బస్సులో ప్రయాణించే అవకాశం ఉండగా, రాజేంద్రనగర్ కోర్టుకు వెళ్లాలంటే మూడు బస్సులు మారాల్సిన పరిస్థితి ఉండేదని ప్రజలు పేర్కొంటున్నారు. క్రిమినల్ కేసులను చేవెళ్ల కోర్టు పరిధిలోకి మార్చడం వల్ల ప్రయాణ ఇబ్బందులు తగ్గడంతో పాటు, సమయం మరియు అనవసర ఖర్చులు ఆదా అవుతాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం మొయినాబాద్ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## చేవెళ్ల టీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా నరేందర్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక..

**జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం**

**కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, సలీం పాషా**






**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 9 (స్కై న్యూస్):** టీయూడబ్ల్యూజే--ఐజేయూ చేవెళ్ల నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పడమటి నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం చేవెళ్లలోని జీపీఆర్ ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సలీం పాషా మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యక్షులుగా గోంగుపల్లి రాఘవేందర్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కార్యదర్శులుగా వామన్ రెడ్డి, శ్రీకాంత్, కోశాధికారిగా ఈపూరి రాఘవేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రవణ్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఇస్మాయిల్, రమేష్, శివ, సుధాకర్, శివారెడ్డి, ముస్తఫా, బిక్షపతి ఎంపికయ్యారు. జిల్లా కమిటీలో సంతోష్, మల్లేష్‌కు బాధ్యతలు అప్పగించారు. నూతన అధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో పలువురు యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మానవతావాది, ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వ్యక్తి నాగిళ్ల కుమారస్వామి

**బీఆర్ఎస్ సీనియర్ నేత సయ్యద్ ఇబ్రహీం నివాళి.. కుటుంబ సభ్యులకు పరామర్శ**



**షాద్‌నగర్, అక్టోబర్ 9 (స్కై న్యూస్):** శ్రీ రామలింగేశ్వర సహకార సంస్థల వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యాపారవేత్త నాగిళ్ల కుమారస్వామి గొప్ప మానవతావాది, ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని బీఆర్ఎస్ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత సయ్యద్ ఇబ్రహీం కొనియాడారు. శుక్రవారం షాద్‌నగర్‌లోని సీఎస్కే విల్లాస్‌లో ఉన్న నాగిళ్ల కుమారస్వామి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపార రంగంలో వినూత్న పద్ధతులతో సంస్థలను స్థాపించి, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన నాగిళ్ల కుమారస్వామి మృతి తీరని లోటని అన్నారు. వ్యాపారంతో పాటు ఆధ్యాత్మిక రంగంలోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని, ఆయన సేవాభావం, మానవతా దృక్పథం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త బండారు రమేష్, నాగిళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు


## 16 గంటల క్లిష్టమైన బ్రెయిన్ బైపాస్

# సర్జరీ విజయవంతం

### 24 ఏళ్ల యువకుడికి ప్రాణాపాయం నుంచి రక్షణ.. రెండు బైపాస్‌లు, రెండు జెయింట్ క్లిప్‌లతో చికిత్స

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 9(స్త్రైన్యూస్ ):** సుమారు రెండు నెలలుగా తరచూ తలనొప్పితో బాధపడుతున్న 24 ఏళ్ల యువకుడికి మలక్‌పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. మెదడులోని మిడిల్ సెరిబ్రల్ ఆర్టరీ (ఎంసీఏ)లో ప్రాణాపాయానికి దారితీసే భారీ అన్యూరిజమ్ (రక్తనాళం ఉబ్బరం)ను గుర్తించిన వైద్యులు, సుమారు 16 గంటలపాటు శ్రమించి రెండు సెరిబ్రల్ బైపాస్‌లు, రెండు ప్రత్యేక క్లిప్‌లతో చికిత్స అందించారు. అన్యూరిజమ్ పగిలితే ప్రాణాపాయం కలిగే అవకాశం ఉండటంతో మెదడుకు రక్తప్రసరణ ఆగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి, అనంతరం రెండు క్లిప్‌లతో ఉబ్బిన రక్తనాళాన్ని రక్తప్రసరణ నుంచి వేరు చేశారు. శస్త్రచికిత్స సమయంలో ఐసీజీ యాంజియోగ్రఫీ ద్వారా అన్యూరిజమ్ పూర్తిగా వేరైనట్లు, రెండు బైపాస్‌ల ద్వారా రక్తప్రసరణ సక్రమంగా కొనసాగుతున్నట్లు నిర్ధారించారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్స అనంతరం యువకుడు అద్భుతంగా కోలుకున్నాడని, ఎలాంటి ముఖ్యమైన నరాల సంబంధిత లోపాలు ఏర్పడలేదని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అతడు తన రోజువారీ పనులను స్వయంగా చేసుకోగలుగుతున్నాడు. సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా. బి. జయానంద్ సుధీర్,




అసోసియేట్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా. వంశీ రెడ్డి పరపతి నేతృత్వంలోని వైద్య బృందం ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. భారీ అన్యూరిజమ్‌ల చికిత్సలో మెదడుకు సాధారణ రక్తప్రసరణను కాపాడుతూ, ప్రమాదకరమైన రక్తనాళపు ఉబ్బరాన్ని నియంత్రించడం అత్యంత కీలకమని వైద్యులు వివరించారు.

## గురుకుల మహిళా డిగ్రీ కాలేజీ లో బతుకమ్మ



**మహబూబ్ నగర్, అక్టోబర్ 9(స్త్రైన్యూస్ ):**తిరుమల హిల్స్ లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బంతి, గునుగు, తంగేడు వంటి రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మ పాటలు ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పేమ్మెన్ క్యాంప్ స్కూలు లో మానసిక వికలాంగులకు మధ్యాహ్నం భోజనం పంపిణీ

**హైద్రాబాద్ అక్టోబర్ 9**:హెయల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ హెయల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్, సీఈఓ, డాక్టర్ కాకుమాను లూర్దు జ్యోతి,కర్మానాలోని వా సవి నగర్ లో గల పేమ్మెన్ క్యాంప్ స్కూలు లో దాదాపు 100 మంది పిల్లలకు సికింద్రాబాద్ రమేష్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగులు లకు ఈరోజు మధ్యాహ్నం భోజనం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండర్ చైర్మన్ డాక్టర్ కాకుమాను లూర్దు జ్యోతి మాట్లాడుతూ మానవతా దృక్పథం తో చేపట్టే ఇ లాంటి కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.



# ధాన్యం మాయలో దోషులు ఎవరు?



రాష్ట్రంలో రైస్‌మిల్లుల యజమానుల నిర్వాకం వల్ల ప్రభుత్వానికి చెందిన కోట్ల రూపాయల బియ్యాన్ని చీకటి బజారుకు పంపిన వైనం తెలిసి జనం నివ్వెరపోతున్నారు. 'భయం లేని కోడి బజార్ల గుడ్డు పెట్టినట్టు' ప్రభుత్వం, చట్టాల పట్ల ఏమాత్రం అదురూ బెదురు లేకుండా మిల్లర్లు రాష్ట్ర ఖజానాకు భారీగా తూట్లు పొడిచారు. ఈ వ్యవహారమంతా చూస్తే తప్పు రెండు వైపులా ఉందనిపిస్తున్నది. పంట దిగుబడి తర్వాత ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల్లో ఆడించి, వచ్చిన బియ్యాన్ని నెలవారీగా పేదలకు పంపిణీ చేస్తుంది. కస్టమ్ మిల్డ్ రైస్ విధానం ప్రకారం ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులు బియ్యంగా మార్చి ఇస్తాయి. అందుకుగాను వారికి క్వింటాలు లెక్కన మిల్లింగ్, రవాణా చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుంది. ధాన్యం అందిన 15 రోజుల్లో పౌరసరఫరాల శాఖకు బియ్యాన్ని అప్పగించవలసి బాధ్యత మిల్లులపై ఉంటుంది.

ఈ ఆగస్టులో సివిల్ సప్లయిస్ అధికారులు రైస్‌మిల్లుల తనిఖీలు చేపట్టగా దిమ్మతిరిగే వాస్తవాలు బయటపడ్డాయి. గత మూడేండ్లుగా ప్రభుత్వం అప్పగించిన ధాన్యంలో 2.7 లక్షల మెట్రిక్ టన్నుల దాకా లెక్కకు అందడం లేదని అధికారులు తేల్చారు. రైస్‌మిల్లుల్లో స్టాకుగా ఉండవలసిన సుమారు రూ.3,905 కోట్ల విలువైన బియ్యం గాయబ్ అయ్యాయి. ప్రభుత్వానికి అప్పగించవలసి బియ్యాన్ని మిల్లుల యజమానులు రాష్ట్రాన్ని దాటించి అధిక ధరలకు అమ్ముకున్నట్లు తెలుస్తున్నది. ఆ సొమ్ముతో వారు రియల్ ఎస్టేట్‌లో, సినిమా నిర్మాణాల్లో పెట్టుబడి పెట్టినట్టు, కొత్త రైస్‌మిల్లులు స్థాపించుకున్నట్లు విచారణలో తేలింది. పంపిణీకి సరిపడే బియ్యం మాత్రమే ఉన్నాయి, ఇప్పుడే మిల్లింగ్ చేయవద్దని చెప్పిన ఒకే మాటను సాకుగా తీసుకుని, అక్రమంగా ఆ సరుకును సరిహద్దులు దాటించారు.

రాష్ట్రంలోని రైస్‌మిల్లులు చాలావరకు ఈ నేరంలో భాగమయ్యాయి. తప్పు చేసిన చిన్నమిల్లుల యజమానులు తాము అమ్ముకున్న బియ్యం విలువను ప్రభుత్వానికి చెల్లించారు. మొత్తం రూ.3,905 కోట్లలో ఇంకా రూ.2,200 కోట్లు వసూలు కావలసి ఉన్నది. సివిల్ సప్లయిస్ చట్టాల ప్రకారం ఇలాంటి నేరాలకు పాల్పడితే వాస్తవ విలువకు తోడుగా 25 % జరిమానా విధిస్తారు. ఆ సొమ్ము చెల్లించకుంటే మిల్లును, దాని యజమాని ఆస్తులను జప్తు చేస్తారు. ఆ మిల్లును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి భవిష్యత్తులో ధాన్యం కేటాయింపు చేయరు. ఈ క్రమంలో సివిల్ సప్లయిస్ అధికారులు పలు జిల్లాల్లోని రైస్‌మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. సుమారు 360 మిల్లుల యజమానులు ప్రభుత్వ చర్యల నుంచి తమను రక్షించాలని కోర్టును ఆశ్రయించారు.

ప్రభుత్వ ఆకస్మిక తనిఖీలకు నిరసనగా తెలంగాణ రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు రాష్ట్రంలో గత నెల 12న మిల్లులు మూతపడ్డాయి. గత పదేండ్లుగా మిల్లింగ్ చార్జీలు చెల్లించని ప్రభుత్వం తమను దొంగల్లా చిత్రిస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు. రైతుల పంటకు, ప్రజలకందే బియ్యానికి మధ్యవర్తిగా కీలక పాత్ర పోషిస్తున్న రైస్‌మిల్లులను కాపాడవలసిన అవసరం, బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. అందుకోసం తాము బకాయిపడిన సొమ్ముపై 12 % వడ్డీని, 25 % జరిమానాలు విధించవద్దని మిల్లర్లు కోరుతున్నారు. సీఎంఆర్ ఒప్పందం ప్రభుత్వానికి అనుకూలంగా ఏకపక్షంగా ఉన్నదని, దానికి సవరణలు అవసరమని వారు అంటున్నారు. ఒప్పందంలో పేర్కొన్నట్లు క్వింటాలు వడ్ల నుంచి 67 కిలోల బియ్యం రావడం లేదని, తడి వల్ల కొంత బియ్యం ముక్కిపోతున్నాయని, బరువు తగ్గుతున్నాయని, ఆ నష్టాన్ని తాము భరిస్తున్నామని చెప్తున్నారు. ఈ నష్టాలతో వేగలేక చాలా మిల్లులు అమ్ముకునే పరిస్థితి ఉన్నదని వారి వాదన. మూడేండ్లుగా సరియైన నిఘా కొరవడి, ప్రజా పంపిణీ వ్యవస్థపై పట్టు లేకుండా కాలం గడిపిన పౌరసరఫరాల మంత్రిత్వ శాఖ, అధికారులు ఇప్పుడే కండ్లు తెరిచినట్లు మిల్లుల మీద పడడానికి కారణమెవరు? దీని వెనుక స్వలాభాపేక్ష రాజకీయ కోణం ఉన్నదా? లేదా అధికారుల అవినీతి బాగోతమున్నదా? అనేది ముందు తేలాలి. బెదిరిపోయిన చిన్నచేపలు బకాయిలు చెల్లించగా ఇక మిగిలినవన్నీ పెద్ద చేపలే. రూ.90 కోట్ల బకాయి ఉన్న పెద్దమిల్లులు ఇప్పుడు సర్కార్‌తో బేరసారాలకు దిగాయి. ఈ మధ్య ఓ సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ విషయంపై మాట్లాడుతూ–డిఫాల్ట్ మిల్లులపై విధించిన వడ్డీ, జరిమానా తొలగింపు గురించి ప్రభుత్వంతో చర్చిస్తానని అన్నారు. గత మూడేండ్లుగా సాగుతున్న ఈ తతంగంపై ముందే పరిస్థితులు చేయి దాటిపోకుండా ప్రభుత్వం చూసుకోవాలి. చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించి ఎలాంటి రాయితీలు ఇవ్వకుండా మొత్తం సొమ్ము ముక్కు పిండి వసూలు చేయాలి. అవన్నీ వదిలేసి మిల్లర్లకు అనుకూలంగా ప్రభుత్వం మొగ్గుచూపితే కోల్పోయిన కోట్లాది రూపాయల ప్రజాధనానికి బాధ్యత ఎవరు వహిస్తారు?

## విజిల్ బ్లోయర్స్ సోషల్ మీడియా వింగ్

**హైదరాబాద్, అక్టోబరు 9:**తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు రోజురోజుకూ మరింత పదునెక్కుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా బిఆర్ఎస్ అధినేతలు కేటీఆర్, హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుని ల్యాండ్ కేటాయింపులు, ప్రాజెక్టుల నిర్వహణపై చేస్తున్న ఆరోపణలు మీడియా, సోషల్ మీడియా వేదికల్లో ట్రెండింగ్‌గా మారుతుండగా.. దానికి పోటీగా రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆస్తులు, వ్యాపార లావాదేవీలపై బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు మాత్రం ప్రజా చర్చగా మారడంలో విఫలమవుతున్నాయి. ఒక వైపు సీఎం విమర్శలకు కేటీఆర్, హరీష్ రావు సుదీర్ఘ ప్రెస్ మీట్లు పెట్టి వివరణలు ఇస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం బీఆర్ఎస్ విమర్శలను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం ఆరోపణలు గుప్పించే నాయకత్వ స్థాయి, కమ్యూనికేషన్ వ్యూహం లో ఉన్న వ్యత్యాసమేనని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి స్వయంగా మైక్ ముందుకొచ్చి నేరుగా కేటీఆర్, హరీష్ రావుల పేర్లను ప్రస్తావిస్తూ దాడి చేస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం సీఎం కుటుంబంపై చేసే ఆరోపణలను పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జ్ మన్నె క్రిశాంక్ ద్వారా డిజిటల్ వేదికలపైకి వదులుతోంది. కేటీఆర్, హరీష్ రావు లాంటి అగ్రనేతలు నేరుగా ముందుండి ఈ ఆరోపణలకు బాధ్యత తీసుకోకపోవడం వల్ల, ఇవి కేవలం సోషల్ మీడియా ఇన్చార్జ్ చేసే వ్యక్తిగత కామెంట్లు, పాయింట్లు లేని డిజిటల్ డ్రామా గా మాత్రమే జనాల్లోకి వెళ్తున్నాయి.మరోవైపు, బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారంలో విశ్వసనీయత, ఆధారాల కొరత స్పష్టంగా కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేవంత్ రెడ్డి కుటుంబ వ్యాపారాలు , ఆస్తులపై బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ విడుదల చేస్తున్న పోస్టులు, పేపర్ క్లిప్పింగులు క్షేత్రస్థాయి ఆధారాలతో కాకుండా ఆరోపణల స్థాయిలోనే ఉండిపోతున్నాయి. సరైన అధికారిక పత్రాలు లేకుండా ప్రతిరోజూ చేసే ఈ దాడి పట్ల సాధారణ ప్రజల్లో పొలిటికల్ సాచ్యురేషన్ పెరిగిపోవడంతో సోషల్ మీడియాలో కూడా వీటికి ఆశించిన స్పందన లభించడం లేదు.అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ , సీఎం రేవంత్ రెడ్డి ఈ ఆరోపణలకు సైలెంట్‌గా ఉండటం కూడా ఒక పక్కా వ్యూహంలో భాగమేనని విశ్లేషిస్తున్నారు. ప్రతిపక్షం నుంచి వచ్చే ప్రతి చిన్న విమర్శకూ సీఎం స్థాయిలో సమాధానం ఇస్తే, ఆ ఆరోపణకు అనవసరంగా హైప్ ఇచ్చినట్లవుతుందనేది కాంగ్రెస్ డిజిటల్ ప్లానర్స్ ఆలోచన. ప్రతిపక్ష నాయకులే రక్షణ ధోరణిలోకి వెళ్లి సుదీర్ఘ వివరణలు ఇస్తుండటంతో, రేవంత్ రెడ్డి ప్రభుత్వం సైలెంట్‌గా ఉంటూనే చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఆ వార్తలకు బ్రేక్ వేస్తోంది. బీఆర్ఎస్ చేస్తున్న మరొక ప్రధాన వ్యూహాత్మక తప్పిదం.. తమ పార్టీ అగ్రనాయకత్వం కాకుండా సోషల్ మీడియా వింగ్ నేతలను విజిల్ బ్లోయర్స్ గా ప్రొజెక్ట్ చేయడం! కేటీఆర్ లేదా హరీష్ రావు ప్రెస్ మీట్ పెట్టి ఆధారాలు బయటపెడితే వచ్చే పొలిటికల్ ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది. కానీ ఇన్చార్జ్‌ల ద్వారా ఆరోపణలు చేయించి, ప్రభుత్వం వారిపై కేసులు పెట్టగానే ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు అంటూ కేటీఆర్ ట్వీట్లు చేయడం వల్ల.. ప్రజలకు ఇది కేవలం ఒక లీగల్ ,డిజిటల్ ఫైట్ లాగానే కనిపిస్తోంది తప్ప, నిరూపించబడిన పెద్ద స్కామ్‌లాగా అనిపించడం లేదని అనుకుంటున్నారు. విమర్శలకు పొలిటికల్ ఇమేజ్, స్పష్టమైన ఆధారాలు తోడైనప్పుడే అవి ప్రజల్లో నానుతాయి. రేవంత్ రెడ్డి విసురుతున్న పొలిటికల్ పంచ్‌లకు ప్రత్యక్షంగా కౌంటర్ ఇస్తూ రక్షణలో పడిపోయిన బీఆర్ఎస్, సీఎం కుటుంబంపై చేసే ఆరోపణల్లో మాత్రం రెండో శ్రేణి నాయకత్వాన్ని వాడటం ద్వారా పెద్ద వ్యూహాత్మక తప్పిదమే చేసింది. ఈ డిజిటల్ వార్తల్లో మైండ్ గేమ్‌ను గెలవాలంటే బీఆర్ఎస్ తన దాడి వ్యూహాన్ని, నాయకత్వ బాధ్యతను పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# విద్యార్థులు, యువత చరిత్రను తెలుసుకోవాలి

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు**

**సిద్దిపేట:**ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ ఒకప్పుడు బెంగాల్ ఆలోచిస్తే దేశం ఆచరిస్తుంది అనేవారు నేడు తెలంగాణ ఏం చేస్తే దేశం అది అనుసరిస్తుంది అనే స్థాయికి ఎదిగాం.పంజాబ్‌ను తలదన్ని వరి ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్.. 33 మెడికల్ కాలేజీలు, 10 వేల ఎంబీబీఎస్ సీట్లతో డాక్టర్ల ఉత్పత్తిలోనూ దేశానికే నంబర్ వన్ తెలంగాణ.1983లో ఎన్టీఆర్‌కు ఏ చేత్తోనైతే దరఖాస్తు ఇచ్చారో ముఖ్యమంత్రి అయ్యాక అదే చేత్తో సంతకం పెట్టి సిద్దిపేట జిల్లాను సాకారం చేసిన కేసీఆర్.ఎన్నికల గోడ రాతలుగా మిగిలిపోయిన సిద్దిపేట జిల్లా, రైలు మార్గం, గోదావరి జలాల దశాబ్దాల కలలను కేసీఆర్ హయాంలోనే నిజం చేసుకున్నాం.పదవుల కంటే తెలంగాణే ముఖ్యమని ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్షతో రాష్ట్రాన్ని సాధించిన నేత కేసీఆర్.పదేళ్లలోనే సాగునీరు, తాగునీరు, విద్యుత్ రంగాల్లో సంపూర్ణ మార్పు తెచ్చి దేశ జీఎస్‌డీపీ వృద్ధిలో తెలంగాణను దిక్సూచిగా నిలిపాం.తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన యువజన సదస్సులో మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు, యువత చరిత్ర తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని, స్వరాష్ట్రంలో సాధించిన ప్రగతితో పాటు సిద్దిపేట సమగ్ర అభివృద్ధిపై ఆయన మాట్లాడారు.

**హరీష్ రావు గారి కామెంట్స్:**

విద్యార్థులు, యువత చరిత్ర గురించి తప్పక తెలుసుకోవాలి.. అప్పుడే గతానికి ఉన్న విలువ, పోరాటాల త్యాగాలు అర్థమవుతాయి. భారత దేశ చరిత్ర, తెలంగాణ చరిత్ర, మన ప్రాంత చరిత్రలకు దేనికదే ప్రత్యేక విశిష్టత ఉంది.తెలంగాణ కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కాదు. 1956 వరకు బూర్గుల రామకృష్ణారావు తొలి ముఖ్యమంత్రిత్వంలో హైదరాబాద్ రాష్ట్రంగా విలసిల్లిన ఘనమైన ప్రాంతం మనది.కొన్ని షరతులు, ఒప్పందాలతో పెద్ద మనుషులు మన రాష్ట్రాన్ని ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేశారు. కలిసిన మరుసటి రోజు నుంచే నిధులు, నీళ్లు, ఉద్యోగాల్లో వివక్ష మొదలైంది.గైర్ ముల్కీ గో బ్యాక్ నినాదంతో ప్రారంభమైన పోరాటం 1969లో మహా ఉద్యమంగా మారింది. ఆ ఉద్యమంలో 396 మంది విద్యార్థులు పోలీసుల తూటాలకు అమరులయ్యారు. ఒక విద్యా సంవత్సరమే స్తంభించిపోయింది.అసెంబ్లీ వద్ద, సిద్దిపేట రంగధాంపల్లి వద్ద, వరంగల్‌లో ఉన్న అమరవీరుల స్తూపాలకు కింద కనిపించే బుల్లెట్ గుర్తులు1969 అమరవీరుల జ్ఞాపకార్థం శిల్పి ఎక్కా యాదగిరి పొందుపరిచిన చారిత్రక చిహ్నాలు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఆకాంక్షను సజీవంగా ఉంచారు. చెన్నారెడ్డి, ఇంద్రారెడ్డి లాంటి నేతలు పోరాటాలు చేసినా రాష్ట్రం రాలేదు. 2001లో కేసీఆర్ పదవులన్నింటినీ గడ్డిపోచలా విడిచిపెట్టి ఉద్యమాన్ని ప్రారంభించి, ఆమరణ నిరాహార దీక్షతో కొట్లాడి జూన్ 2, 2014న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు.తెలంగాణ వచ్చిన తొలినాళ్లలో పల్లెలు, పట్నాల్లో కరెంట్ కోతలు, సాగునీరు లేక నెర్రలు బారిన నేలలు ఉండేవి. కానీ కేసీఆర్ పదేళ్ల పాలనలో జీఎస్‌డీపీ వృద్ధిలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచింది.

## బిజినెస్

# రుణ గ్రహీతలకు ఆర్‌బీఐ షాక్..
# ఇంటి, వాహన రుణాలపై పెరగనున్న వడ్డీ రేటు..!

### పోస్ట్ పెయిడ్ కస్టమర్లకు షాకిచ్చిన ఎయిర్‌టెల్.. టారిఫ్‌ల ధరలు పెంపు..!




దేశంలోని ప్రముఖ టెలికామ్ సంస్థ భారతీ ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు షాకిచ్చింది. పోస్ట్‌పెయిడ్ ప్లాన్ల టారిఫ్‌లను సుమారు 3 నుంచి 10 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు ఈ నెల 8వ తేదీ (గురువారం) నుంచే అమల్లోకి వస్తాయని కంపెనీ స్పష్టంచేసింది. అయితే ధరల పెంపుతోపాటు వినియోగదారులను ఆకర్షించేందుకు కొత్తగా ఉచిత అంతర్జాతీయ రోమింగ్ ప్రయోజనాన్ని కూడా జోడించింది. తాజాగా సవరించిన ప్లాన్‌లు అన్నింటిలోనూ ప్రతి సిమ్‌కు ఏడాదికి ఒకసారి ఉచితంగా అంతర్జాతీయ రోమింగ్ ప్యాక్‌ను అందిస్తున్నట్లు ఎయిర్‌టెల్ తెలిపింది. ఈ కాంప్లిమెంటరీ ప్యాక్‌లో భాగంగా 5 రోజుల వ్యాలిడిటీతో 5జీబీ డేటా, 60 నిమిషాల కాల్స్, 25 అవుట్‌గోయింగ్ ఎస్ఎంఎస్, ఉచిత ఇన్‌కమింగ్ ఎస్ఎంఎస్ వంటి ప్రయోజనాలు లభిస్తాయి. తరచూ విదేశీ ప్రయాణాలు చేసేవారికి ఈ కొత్త బెనిఫిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కంపెనీ భావిస్తున్నది. ఈ ప్లాన్ల కింద అపరిమిత డేటా, కాలింగ్ సౌకర్యాలు యథావిధిగా కొనసాగుతాయి. నూతన మార్పుల ప్రకారం.. వ్యక్తిగత కనెక్షన్ల కోసం ఉద్దేశించిన రూ.449 ప్లాన్ ధరను రూ.499కి పెంచారు. ఇక ఫ్యామిలీ ప్లాన్ల విషయానికొస్తే.. గతంలో రెండు సిమ్‌ల కోసం రూ.699గా ఉన్న ప్లాన్ ధర ఇప్పుడు రూ.749కి చేరింది. మూడు సిమ్‌లతో లభించే రూ.999 ప్లాన్ కోసం ఇకపై రూ.1,049 చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా నాలుగు సిమ్‌ల కోసం రూ.1,249, రూ.1,449 ధరలతో ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. ఐదు సిమ్‌లతో పాటు నెట్‌ఫ్లిక్స్ స్టాండర్డ్ సబ్‌స్క్రిప్షన్‌తో వచ్చే ప్లాన్ ధరను రూ. 1,799గా నిర్ణయించారు. ఈ మార్పులపై భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ అమిత్ త్రిపాఠి మాట్లాడుతూ.. భారత మార్కెట్లో తమ పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు అత్యుత్తమ శ్రేణి అనుభవాన్ని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమ నెట్‌వర్క్ అనుభవంతోపాటు 5+పై ఫాస్ట్ లేన్ టెక్నాలజీ, స్పామ్, మోసాల నుంచి నిరంతర రక్షణ కల్పిస్తున్నామన్నారు.

### ప్రభుత్వ స్కీముల్లో ప్రైవేట్ బ్యాంకులు



**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి ముద్రా యోజన, స్టాండప్ ఇండియా సహా ఆర్థిక సమ్మిళితత్వానికి సంబంధించిన ప్రభుత్వ పథకాల్లో మరింతగా పాలుపంచుకో వాలని ప్రైవేట్ బ్యాంకులకు ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి సంజయ్ లోహియా సూచించారు. ఇందుకు సంబంధించి అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ రంగ బ్యాంకుల చీఫ్‌లతో భేటీ సందర్భంగా ఆయన ఈ విషాలు తెలిపారు. అణగారిన వర్గాల ప్రజలకు సేవలందించడంపైనా, వారి బ్యాంకింగ్ అవసరాలను తీర్చడంపైనా మరింతగా దృష్టి పెట్టాలని ప్రైవేట్ బ్యాంకులను ఆయన కోరారు. భేటీ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాల పురోగతిని సమీక్షించినట్లు ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దాంతో రెపోరేటు 5.50 శాతానికి చేరింది. ఫ్లోటింగ్ ఇంట్రెస్ట్ రేటుకు హౌసింగ్, వెహికల్ లేదా ఇతర స్థిరాస్తి లోన్ తీసుకున్నవారిపై వడ్డీ భారం పడనుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజులపాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతోపాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటును 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటును 5.75 శాతానికి పెంచారు. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దాంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జూలైలో ఇది 4.45 శాతంగా ఉంది. అదేవిధంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపోరేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపోరేటు పెరగవచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండవచ్చని ఎస్‌బీఐ రిసెర్చ్ పేర్కొన్నది.




**పెరిగిన వడ్డీ భారం మీ లోన్‌పై ఏవిధంగా ప్రభావితం చూపుతుంది?**

ఫ్లోటింగ్ ఇంట్రెస్ట్ రేటుకు హౌసింగ్, వెహికల్ లేదా ఇతర స్థిరాస్తి లోన్ తీసుకున్నవారిపై వడ్డీ భారం పడనుంది. ఈ వడ్డీ భారాన్ని ఆయా బ్యాంకులు రెండు రకాలుగా వినియోగదారునిపై వేయనున్నాయి. నేరుగా ఈఎంఐపైన వేస్తే మీరు చెల్లించే నెలవారి ఈఎంఐ పెరుగుతుంది. అలా కాకుండా లోన్ కాలవ్యవధి పైన కూడా వేయవచ్చు. అంటే.. ఈఎంఐలో తేడా రాకుండగ మొత్తం లోన్ చెల్లించే కాల వ్యవధి పెరుగుతుంది. బ్యాంకును సంప్రదించి ఈ రెండింటిలో ఏది మీకు వర్తించింది అనేది తెలుసుకోవచ్చు. ఈఎంఐ పెంచుకోవడం మంచిదా? లేక లోన్ కాలవ్యవధి పెంచుకుంటే మంచిదా అనేది ఆర్థిక నిపుణులను అడిగి తెలుసుకోవాలి.

# ఆర్బీఐ రెపో రేట్ పెంపు ప్రభావం..
# భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్

భారత స్టాక్ మార్కెట్ బుధవారం భారీగా నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 429 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 173 పాయింట్లు నష్టపోయింది. రెపో రేట్ పెంచుతూ ఆర్బీఐ తీసుకున్న నిర్ణయం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. రెపో రేటును ఆర్బీఐ 25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) పెంచడంతో రెపో రేటు మొత్తం 5.50 శాతానికి పెరిగింది. 2023 ఫిబ్రవరి తర్వాత రెపో రేటును ఆర్బీఐ పెంచింది. ఈ నిర్ణయం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. దీంతో స్టాక్ మార్కెట్ నష్టాల్లో కొనసాగింది. సెన్సెక్స్ 429.11 పాయింట్లు (0.59 శాతం) నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 173.05 పాయింట్లు (0.76 శాతం) నష్టపోయి 22,603.05 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 76.43 పాయింట్లు (0.43 శాతం) నష్టపోగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 15.71 పాయింట్లు (0.17 శాతం) లాభపడింది. నిఫ్టీ మెటల్ షేర్లు 2.33 శాతం పడిపోగా, నిఫ్టీ ఆటో 1.58 శాతం నష్టపోయింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ మాత్రం ఒక శాతం లాభపడింది. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ స్వల్పంగా బలహీనపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో కోటక్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా కోటక్ బ్యాంక్ షేర్లు 2.21 శాతం లాభపడ్డాయి. మరోవైపు ఏసియన్ పెయింట్స్, ఎల్ అండ్ టీ, ఇన్ఫోసిస్, బీఈఎల్, టైటాన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా నష్టపోయింది టైటాన్ (3.52 శాతం). డాలర్‌తో 45 పైసలు పడిపోయిన రూపాయి 96.77 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర స్వల్పంగా పెరిగింది. 0.98 శాతం పెరిగిన బ్యారెల్ క్రూడాయిల్ ధర 101.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# దంచికొట్టిన వార్నర్..
# బంగ్లాదేశ్‌పై ఆసీస్ ఘన విజయం

వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2026 టోర్నీలో ఇవాళ ఆస్ట్రేలియా ఛాంపియన్స్, బంగ్లాదేశ్ ఛాంపియన్స్ జట్లు తలపడ్డాయి. షార్జా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బంగ్లాదేశ్‌పై 37 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. కెప్టెన్ డేవిడ్ వార్నర్ (38 బంతుల్లో 66; 7 ఫోర్లు, 4 సిక్సర్లు), కల్లమ్ ఫెర్గూసన్ (36 బంతుల్లో 63; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపు అర్ధ శతకాలతో సత్తా చాటారు. వికెట్ కీపర్ బెన్ డంక్ (45 నాటౌట్) కూడా బ్యాట్ ఝులిపించాడు. బంగ్లా బౌలర్లలో అబు జయేద్ 3 వికెట్లు పడగొట్టగా.. జియావుర్ రహ్మాన్ 2, రుబెల్ హొసేన్ ఓ వికెట్ దక్కించుకున్నారు. భారీ లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేకపోయింది. కెప్టెన్ మహ్మదుల్లా (73 నాటౌట్) ఒంటరిపోరాటం చేసినా తన జట్టును గెలిపించలేకపోయాడు. నిర్ణీత ఓవర్లలో ఆ జట్టు 6 వికెట్ల నష్టానికి 166 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆసీస్ బౌలర్లలో ఫవాద్ అహ్మద్ 2, బెన్ హిల్ఫెన్హాస్, కేన్ రిచర్డ్‌సన్, డి ఆర్కీ షార్ట్ తలో వికెట్ పడగొట్టారు.



### టీ20ల్లో ఏడవ ర్యాంక్‌కు చేరిన శ్రేయాస్ అయ్యర్

**దుబాయ్:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్ సెంచరీ కొట్టిన శ్రేయాస్ అయ్యర్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. కెరీర్‌లోనే బెస్ట్ ర్యాంక్ అందుకున్నాడు. 43 బంతుల్లో 102 రన్స్ చేసిన అయ్యర్.. టీ20ల్లో ప్రస్తుతం ఏడవ ర్యాంక్‌కు చేరుకున్నాడు. మరో వైపు వన్డే కెప్టెన్ శుభమన్ గిల్.. ఆ ఫార్మాట్ బ్యాటింగ్ పొజిషన్‌లో టాప్‌లో ఉన్నాడు. తొలి టీ20లో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన శ్రేయాస్ ఏకంగా 18 స్థానాలను మెరుగుపరుచుకున్నాడు. ఆ ఫార్మాట్‌లో బెస్ట్ ర్యాంక్ సాధించిన మూడవ భారత బ్యాటర్‌గా నిలిచాడు. టీ20ల్లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలు అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. తిలక్ వర్మ 10వ స్థానంలో నిలిచాడు. టాప్-10 స్థానాల్లో నలుగురు భారత బ్యాటర్లు ఉండడం గమనార్హం. యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ 8 స్థానాలు ఎగబాకి 46వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.



## స్పోర్ట్స్

### సూపర్ కింగ్స్‌లోకి పోలార్డ్



వెస్టిండీస్ దిగ్గజ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో జట్టు మారాడు. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్ కేప్‌టౌన్‌కు ఆడిన అతడు.. 2027 సీజన్ కోసం? జోబర్గ్ సూపర్ కింగ్స్‌తో జతకట్టాడు. ఇవాళ జరిగిన వేలంలో పోలార్డ్‌ను సూపర్ కింగ్స్ సొంతం చేసుకుంది. వేలానికి ముందు కేప్‌టౌన్ పోలార్డ్‌ను విడుదల చేసింది. దీంతో అతను 1.5 మిలియన్ ర్యాండ్‌ల (సుమారు రూ. 87 లక్షలు) బేస్‌ప్రైజ్‌తో వేలంలోకి వచ్చాడు. పోలార్డ్ సూపర్ కింగ్స్ జట్టులో విండీస్ సహచరులు జేసన్ హోల్డర్, అకీల్ హొసేన్ తదితరులతో కలుస్తాడు.

2027 సీజన్ కోసం జోబర్గ్ సూపర్ కింగ్స్ నిలుపుకున్న ఆటగాళ్లు..
జారెన్ బాచర్, మాథ్యూ డివిలియర్స్, లియుస్ డు ప్లూయ్, డోనోవన్ ఫెరీరా, డయాన్ ఫారెస్టర్, అకీల్ హొసేన్ (వెస్టిండీస్), దువాన్ జాన్సెన్, రిలీ రోసోవ్, జాంకో స్మిత్, ప్రేనెలన్ సుబ్రాయెన్, జేమ్స్ విన్స్ (ఇంగ్లండ్)
ప్రీ సైనింగ్: జేసన్ హోల్డర్ (వెస్టిండీస్)

కాగా, ఇవాళ జరుగుతున్న వేలంలో పోలార్డ్‌తో పాటు ట్రెంట్ బౌల్ట్, ఫాఫ్ డుప్లెసిస్ మార్కీ ప్లేయర్లుగా బరిలో ఉన్నారు. మొత్తం 19 ఖాళీల కోసం ఇవాళ్టి వేలం జరుగుతుంది. 2027 సౌతాఫ్రికా టీ20 లీగ్ జనవరి 17 నుంచి ఫిబ్రవరి 21 వరకు జరగనున్న విషయం తెలిసిందే.



## దశరథ మహారాజుగా అరుణ్ గోవిల్.. 'రామాయణం' నుంచి ఫస్ట్ లుక్!

బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' నుంచి తాజాగా మేకర్స్ మరో ఆసక్తికర అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అయోధ్య రాజు దశరథుడిగా నటిస్తున్న సీనియర్ నటుడు అరుణ్ గోవిల్ పోస్టర్‌ను చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. గతంలో రామానంద్ సాగర్ తెరకెక్కించిన ఐకానిక్ టీవీ సీరియల్ 'రామాయణ్'లో రాముడి పాత్రలో నటించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అరుణ్ గోవిల్, దశాబ్దాల తర్వాత మళ్లీ అదే రామాయణ కథలోకి రావడం విశేషం. ఒకప్పుడు ఒక తరానికి రాముడిని పరిచయం చేసిన ఆయన, ఇప్పుడు అయోధ్య రాజుగా రామాయణ ప్రపంచంలోకి తిరిగి వస్తున్నారు. దశరథుడిగా అరుణ్ గోవిల్ అంటూ చిత్రబృందం రాసుకొచ్చింది. ఈ పోస్టర్‌లో 68 ఏళ్ల అరుణ్ గోవిల్ రాజసంగా అయోధ్య సింహాసనంపై కూర్చున్నట్లుగా కనిపించారు. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తుండగా, అరుణ్ గోవిల్ కీలకమైన దశరథ మహారాజు పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా మొదటి భాగం నవంబర్ 6, 2026న దీపావళి కానుకగా విడుదల కానుండగా, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటు ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ చిత్రం విడుదల కానుంది.



## బేబీ బంప్‌తో సమంత స్టన్నింగ్ లుక్.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న గ్లామరస్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రత్యేకమైన ఫ్యాషన్ లుక్‌లో సమంత ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా బ్లాక్ కేప్-స్టైల్ టాప్, మెరిసే సీక్విన్ స్కర్ట్‌లో ఆమె కనిపించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సమంత తాజా ఫోటోషూట్‌లో బ్లాక్ సాటిన్ హై-నెక్ టాప్ ధరించారు. దానికి ఫ్లోర్ లెంగ్త్ కేప్ స్లీవ్స్ జోడించడంతో ఆమె లుక్‌కు మరింత రాయల్ టచ్ వచ్చింది. డార్క్ బ్రాంజ్, బ్లాక్ సీక్విన్ డిజైన్‌తో ఉన్న హై-వెయిస్ట్ స్కర్ట్ ఈ మొత్తం లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎంతో స్టైలిష్‌గా కనిపించేలా ఈ లుక్‌ను రూపొందించారు. సమంతకు సంబంధించిన స్టైలింగ్, ఆభరణాలు, హెయిర్‌స్టైల్, మేకప్ మొత్తం కలిసి ఫోటోషూట్‌కు మరింత గ్లామర్‌ను తీసుకొచ్చాయి. తాజా ఫొటోల్లో సమంత తనదైన కాన్ఫిడెంట్ స్టైల్‌తో కనిపించారు. ఆమె ఫొటోలు సోషల్ మీడియాలోకి వచ్చిన వెంటనే అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. సమంత కొత్త లుక్ చాలా అందంగా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం సమంతకు సంబంధించిన ఈ ఫోటోషూట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆమె ఫ్యాషన్ సెన్స్, స్టైలిష్ లుక్‌పై అభిమానులు ప్రత్యేకంగా కామెంట్లు చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాణ రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆమె నిర్మాణంలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రంపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అదే సమయంలో 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్ తమిళం' కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తూ.. మరోవైపు 'రక్త బ్రహ్మాండ్' అనే వెబ్ సిరీస్‌లోనూ భాగమవుతున్నారు. దీంతో వ్యక్తిగత విషయాలతో పాటు వరుస ప్రాజెక్టులతోనూ సమంత ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తున్నారు.




## సంక్రాంతి రేసు నుంచి 'విశ్వంభర' ఔట్.. మార్చిలో మెగాస్టార్ డబుల్ ట్రీట్!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతున్న ఈ విజువల్ వండర్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తికావడంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే విషయంలో కొంతకాలంగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు త్వరలోనే తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం.. 'విశ్వంభర'ను 2027 మహాశివరాత్రి సందర్భంగా మార్చి నెలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వాస్తవానికి 'విశ్వంభర' ఎప్పుడో ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ ఇది సోషియో ఫాంటసీ కథ కావడంతో సినిమాలోని విజువల్స్, గ్రాఫిక్స్ అత్యంత సహజంగా, అద్భుతంగా కనిపించాలనే ఉద్దేశంతో మేకర్స్ ఎక్కువ సమయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో పనులు చేయించినట్లు సమాచారం. క్వాలిటీ విషయంలో రాజీపడకపోవడం వల్లే సినిమా విడుదలలో ఆలస్యం జరిగినట్లు టాక్. ప్రస్తుతం సినిమా తుది కాపీకి సంబంధించిన పనులు పూర్తయినప్పటికీ.. భారీ స్థాయి చిత్రానికి సరైన విడుదల తేదీ, సోలో రిలీజ్ అవకాశాన్ని చూసుకుంటున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మెగాస్టార్ చిరంజీవి సినిమాలకు సంక్రాంతి సీజన్ ప్రత్యేకమైనది. దీంతో 'విశ్వంభర' కూడా 2027 సంక్రాంతి బరిలోకి వస్తుందని గతంలో ప్రచారం జరిగింది. అయితే అదే సమయంలో చిరంజీవి-బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మరో భారీ చిత్రం 'కాకా'ను జనవరి 13న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఒకే హీరో నటించిన రెండు భారీ చిత్రాలు ఒకే పండుగ సీజన్‌లో విడుదలైతే కలెక్షన్ల పరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. దీంతో రెండు సినిమాల మధ్య పోటీ లేకుండా 'విశ్వంభర'ను సంక్రాంతి రేసు నుంచి తప్పించి మార్చిలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. 'విశ్వంభర'ను మహాశివరాత్రి సీజన్‌కు తీసుకురావడం వెనుక మరో కారణం కూడా ఉందని తెలుస్తోంది. ఫాంటసీ కథాంశం, దైవిక అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు శివరాత్రి పండుగ వాతావరణం మరింతగా కలిసొస్తుందని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం.అదే జరిగితే సంక్రాంతికి 'కాకా'తో సందడి చేయనున్న చిరంజీవి.. కేవలం రెండు నెలల వ్యవధిలోనే మార్చిలో 'విశ్వంభర'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఒకే ఏడాది తొలి మూడు నెలల్లోనే మెగాస్టార్ నుంచి రెండు భారీ చిత్రాలు విడుదల కానుండటం అభిమానులకు డబుల్ ట్రీట్‌గా మారనుంది.



## 'ఆయా షేర్' వీడియో సాంగ్ విడుదల.. ఈ పాటతోనే 'ది ప్యారడైజ్'చిత్రానికి భారీ హైప్!

నేచురల్ స్టార్ నాని హీరోగా, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమా విడుదలకు ముందే పాటలు, మాస్ ఎలివేషన్స్‌తో 'ది ప్యారడైజ్' సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఇక ఈ చిత్రానికి సంబంధించిన తొలి పాట 'ఆయా షేర్' ఇప్పటికే ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుంది యూట్యూబ్‌తో పాటు డిజిటల్ వేదికలపై కూడా ఈ సాంగ్ అనేక రికార్డులు సాధించింది. దీంతో పాటు 'ది ప్యారడైజ్' మ్యూజికల్ ప్రమోషన్స్‌లో ఈ పాట కీలకంగా మారింది. తాజాగా ఈ పాటకి సంబంధించిన ఫుల్ వీడియో విడుదల చేశారు. ఈ పాటలోని నాని సిగ్నేచర్ స్టెప్పులకి ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. 'ఆయా షేర్' పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన హై-వోల్టేజ్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కాసర్ల శ్యామ్ రాసిన ఎనర్జిటిక్ సాహిత్యానికి అద్దుల జంగిరెడ్డి, అర్జున్ చాందీ తమదైన శైలిలో గాత్రాన్ని అందించారు. పాటలోని క్యాచీ ట్యూన్, పవర్‌ఫుల్ బీట్స్, మాస్ కొరియోగ్రఫీ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి.యూత్, కాలేజీ విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకుల్లో ఈ పాటకు మంచి క్రేజ్ ఏర్పడింది. సోషల్ మీడియా రీల్స్ నుంచి పబ్లిక్ ఈవెంట్స్, వేడుకల వరకు 'ఆయా షేర్' సందడి కనిపించింది. ముఖ్యంగా పాటలోని బీట్స్, హుక్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకోవడంతో ఇది సెలబ్రేషన్ సాంగ్‌గా మారిపోయింది. 'దసరా' వంటి ఊరమాస్ విజయాన్ని అందించిన శ్రీకాంత్ ఓదెల.. 'ది ప్యారడైజ్'లో నానిని మరింత రగ్గడ్, పవర్‌ఫుల్ పాత్రలో చూపించారు. నాని లుక్, బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఇప్పటివరకు కనిపించని విధంగా నాని కొత్త అవతార్‌లో కనిపించడం సినిమాపై అంచనాలు మరింత పెంచింది. కాయాదు లోహర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, రాఘవ్ జుయల్, బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో నటించారు.

# దేశం 5జీ-రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది

‘డిజిటల్ ఇండియా’ కార్యక్రమం టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జరిగిన ఒక ప్రధాన ప్రయత్నంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. సాంకేతికత అనేది డిజిటల్ అంతరాన్ని తగ్గించి, కేవలం వనరులు ఉన్న కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతీ ఒక్కరికీ అందాలనేదే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పరివర్తనలో మొబైల్ ఫోన్‌ను కేంద్ర బిందువుగా మార్చడం ద్వారా సాధారణ పౌరులకు కూడా అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని అన్నారు. దేశ రాజధాని దిల్లీలోని యశోభూమిలో జరిగిన పదో ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)లో ఈ మేరకు ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

“డిజిటల్ అంతరం రూపంలో దేశం పెద్ద సవాలును ఎదుర్కొంటోంది. గత 10–12 ఏళ్లుగా మొబైల్ ఫోన్ ఆధునిక సమాచార సాధనంగానే కాకుండా, సుపరిపాలనకు ఒక ముఖ్య సాధనంగా కూడా ఆవిర్భవించింది. మొబైల్ ఫోన్ డిజిటల్ ఇండియా దార్శనికతకు కేంద్ర బిందువుగా నిలిచింది. సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం టెలికాం రంగంలో సంస్కరణలు చేపట్టింది. ఆ రంగంలో మౌలిక సదుపాయాలను విస్తరించింది. మొబైల్ ఫోన్లు, ఇతర టెలికాం హార్డ్‌వేర్‌లు దేశంలోనే తయారయ్యేలా చూడటంపై దృష్టి సారించింది. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరుకుంది. ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు ఈ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం పది రెట్లు పెరిగింది. దేశం 5జీ-రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది. “

**‘మొబైల్ ఫోన్ సుపరిపాలనకు కీలకంగా మారింది’**

ప్రభుత్వ పథకాల పంపిణీలో మొబైల్ ఫోన్లు, డిజిటల్ కనెక్టివిటీ పోషిస్తున్న పాత్రను ప్రధాని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా రూ.50 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు



బదిలీ అయ్యాయని అన్నారు. ఆ డబ్బు తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా నివారించడం ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా చేశామని వివరించారు. వందలాది ప్రభుత్వ సేవలు ఇప్పుడు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు లింక్ అయిన బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అవుతున్నాయని వెల్లడించారు.

“ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు లింక్ అయిన బ్యాంకు ఖాతాలకు రూ. 50 లక్షల కోట్లు చేరాయి. తత్ఫలితంగా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా అయ్యాయి. ఈ మొత్తం తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా నివారించాం. ఇలాంటి అవకతవకలను అరికట్టే ప్రయత్నాలను కొనసాగించడానికి నేను కట్టుబడి ఉన్నాను. పీఎం కిసాన్ కింద రూ. 4 లక్షల కోట్లను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశాం. ఈ డబ్బు వారి ఖాతాలో జమ అయినప్పుడు రైతుల మొబైల్ ఫోన్‌లకు నోటిఫికేషన్ వస్తుంది. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను గతంలో పొందలేని కోట్లాది మంది చిన్న రైతులకు ఈ డబ్బు అందింది. మొబైల్ ఫోన్ ఇకపై కేవలం సమాచార మార్పిడి లేదా చాటింగ్ సాధనం మాత్రమే కాదు. ఇది పౌరులకు తక్కువ ప్రయాణం, తక్కువ నిరీక్షణ, తక్కువ ఖర్చు, ఎక్కువ సౌకర్యాన్ని కల్పించింది” అని మోదీ వ్యాఖ్యానించారు.

టెలికాం రంగంలో భారత్ సాధించిన ప్రగతిలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. గత కొన్నేళ్లుగా ఈ వేదిక దేశ ప్రగతిని, దాని ఆకాంక్షలను ప్రతిబింబించే ఒక వేదికగా ఆవిర్భవించిందని అభిప్రాయపడ్డారు. గత దశాబ్ద కాలంలో దేశ టెలికాం మౌలిక సదుపాయాల విస్తరణను కూడా ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. ఇందులో భాగంగా మారుమూల ప్రాంతాలలో సెల్ టవర్ల ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ల విస్తరణ, డేటా మరింత అందుబాటులోకి రావడం వంటి అంశాలను వివరించారు.

**ఆ మోసాలపై వరల్డ్‌వైడ్ ఫ్రేమ్‌వర్క్ ఉండాలి : మోదీ**

సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ నేరాలను ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్త చట్రం (ఫ్రేమ్‌వర్క్) కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. డిజిటల్ మోసాలు దేశ సరిహద్దులను దాటాయని, అందుకే సంబంధిత వర్గాలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు. డిజిటల్ మోసాలను అరికట్టడానికి ప్రభుత్వాలు, టెక్నాలజీ కంపెనీలు, టెలికాం ఆపరేటర్లు, ఆర్థిక సంస్థలు యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల నమ్మకాన్ని పొందినప్పుడే టెక్నాలజీ విస్తృత స్థాయికి చేరుకోగలదని అభిప్రాయపడ్డారు.

**ఐఎంసీపై సింధియా ప్రశంసలు**

భారత్‌కు ప్రపంచ సాంకేతిక ఆశయాలను ముందుకు నడిపించడానికి అవసరమైన మానవ వనరులు (మ్యాన్‌పవర్, చలనశీలత(మొబిలిటీ), దృక్పథం(మైండ్‌సెట్) ఉన్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా అభిప్రాయపడ్డారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) దేశ సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి ప్రదర్శించే వేదికగా పరిణామం చెందాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకే డేటా అందిస్తున్న దేశాల్లో భారత్ ఒకటిగా ఉందని అన్నారు. బ్రాడ్‌బ్యాండ్ చందాదారుల సంఖ్య దశాబ్దం క్రితం కేవలం 6 కోట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 110 కోట్లు దాటిందని చెప్పారు.

# చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం

స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. జజుజ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్‌కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళు లర్పించారు. దిల్లీలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్టు తెలిపారు.

అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, జజుజ జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్ లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు.

“రాజ్యసభ, లోక్‌సభలకు చెందిన సుమారు 300 మంది ఎంపీలు శాంతియుతంగా నిరసన తెలపాలని భావిస్తున్నారు. రెండు రోజులుగా మమ్మల్ని నిరసన చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. మొదటి రోజు, మమ్మల్ని ఎన్నికల సంఘం కార్యాలయం బయట అడ్డుకున్నారు. ఆ తర్వాత, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలపాలని మేము భావించాము. బుధవారం మీరు చూసినట్లుగా, మమ్మల్ని అక్కడ కూడా అడ్డుకున్నారు. మా వాళ్లపై దాడులు చేశారు. మా వాళ్లను



కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. వాస్తవం ఏమిటంటే నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భగవత్?లు ఒక నేరపూరిత కుట్ర ద్వారా దేశాన్ని హైజాక్ చేశారు. రాజ్యాంగాన్ని నాశనం చేశారు. ఓట్లను దొంగిలించారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ప్రతిపక్షంగా మేము హామీ ఇస్తున్నాం. వారిని న్యాయస్థానం ముందు నిలబెడతాం. ఈ నలుగురిని చట్టం ముందు నిలబడటాన్ని మీరు చూస్తారు.”

**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అపాయింట్‌మెంట్ కోరిన ఇండీ కూటమి**

ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నా రు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు.

**‘చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం’**

ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్క్వేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్క్వేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. “ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి” అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.

# రియాద్‌పై హూతీల దాడులు విమాన సర్వీసులు రద్దు చేసిన భారత్

సౌదీ అరేబియాలో పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఆభా అంతర్జాతీయ విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని హూతీ రెబల్స్ దాడులకు పాల్పడటంతో విమాన రాకపోకలపై ప్రభావం పడింది. భద్రతా కారణాలతో భారత్‌కు చెందిన పలు విమానయాన సంస్థలు రియాద్ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రియాద్‌కు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమానాలను అక్టోబర్ 10 వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటిం చాయి. ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థలు తెలిపాయి. రద్దైన టికెట్లకు పూర్తి రిఫండ్ లేదా ఉచితంగా మరో తేదీకి మార్చుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించాయి. గురువారం దిల్లీ నుంచి రియాద్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కూడా పరిస్థితుల నేపథ్యంలో తిరిగి దిల్లీకి వచ్చేసింది. అనంతరం ఆ విమానాన్ని రద్దు చేశారు. ప్రయాణికులకు పూర్తి రిఫండ్ అందిస్తామని ఎయిరిండియా తెలిపింది. కోచి నుంచి రియాద్‌కు వెళ్లాల్సిన రెండు విమానాలు కూడా రద్దయ్యాయి. కోచి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం రాత్రి బయల్దేరాల్సిన అకాసా ఎయిర్ ఞూ523, సౌదియా ూం775 విమానాలను రద్దు చేశారు. ఈ విమానాల్లో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థల కస్టమర్ కేర్‌ను సంప్రదించి తదుపరి ప్రయాణ ఏర్పాట్ల గురించి తెలుసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచిం చారు. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానా శ్రయంతో పాటు ఆభా విమానాశ్రయంపై అక్టోబర్ 6, 7 తేదీల్లో దాడులు జరిగినట్లు సౌదీ అధికారులు తెలిపారు. ఈ ఘటనల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, 36 మంది గా యపడ్డారు. ఆభా విమానాశ్రయంలో ఇద్దరు మృతి చెందగా, 28 మంది గాయపడ్డారు. కింగ్ ఖలీద్ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఒకరు మరణించగా, ఎనిమిది మంది గాయపడ్డారు. ఆ దాడులకు యెమెన్‌లోని హూతీ మిలీషియా బాధ్యత వహించినట్లు సమాచారం. రియాద్ వైపు ప్రయోగిం చిన రెండు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు తెలిపాయి. ఖమీస్ ముషైత్ వైపు వచ్చిన మరో క్షిపణిని కూడా అడ్డుకున్నట్లు వెల్లడించాయి. క్షిపణులను అడ్డుకునే సమయంలో కిందపడిన శకలాల కారణంగా రియాద్‌లోని ఓ కిండర్‌గార్టెన్, ఓ వైద్య కేంద్ర భవన సముదాయానికి నష్టం వాటిల్లినట్లు సౌదీ పౌర రక్షణ విభాగం తెలిపింది. దాడులకు ప్రతిస్పందనగా సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు యెమెన్‌లో హూతీలకు చెందిన 82 సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించాయి. సౌదీలోని పౌరులు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్న దాడులను సహించబోమని సంకీర్ణ దళాల ప్రతినిధి హెచ్చరించారు. ఇక దాడులను భారత్ తీవ్రంగా ఖండిం చింది. పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపిన భారత్.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. సౌదీ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా ఉంటుందని పేర్కొంది.

**భారతీయులకు సూచనలు**

మరోవైపు సౌదీలోని భారతీయులకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం కీలక సూచనలు చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైనప్పుడు ఇళ్లలోనే ఉండాలని సూచించింది.

## సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి.. సుప్రీంకోర్టులో పిటిషన్



దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, ‘సర్’ ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

## సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు



మరణశిక్షలను జీవిత ఖైదుగా మార్చే విషయంలో సుప్రీంకోర్టు క్షమా గుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయని, దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని దేశ అత్యున్నత న్యాయస్థానం జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. గతంలో హత్య కేసుల్లో శిక్షలు ‘అరుదైన వాటిలో అత్యంత అరుదైన’ సిద్ధాంతం ఆధారంగా ఉండేవని అన్నారు. ఎందుకంటే ఆ రోజుల్లో హత్యలు చాలా అరుదుగా జరిగేవని, కానీ ప్రస్తుత రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మర్డర్ కేసులో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చుకున్న ఒక ఖైదీని ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ వ్యాఖ్యలు చేశారు.

**‘క్షమా గుణానికి ఎక్కడో ఒక చోట ఎండ్ కార్డ్ పడాలి’**

‘సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయి. దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. ఒక తండ్రి తన సొంత పెద్ద కుమార్తెపై అత్యాచారం చేసి, ఆమెను హత్య చేశాడు. ఆ కేసులో అతడి భార్య ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా నిందితుడికి జీవిత ఖైదు పడింది. కొన్నేళ్ల తర్వాత ఆ నిందితుడు పెరోల్‌పై బయటకు వచ్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు పగతో భార్యను (చిన్న కూతురి కళ్ల ముందే) దారుణంగా హత్య చేశాడు. చిన్న కుమార్తె ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా అతడికి కోర్టు మరణశిక్ష విధించింది. అయితే, ఆ నిందితుడు చిన్న కూతురిని చంపలేదనే కారణంతో సుప్రీంకోర్టు అతడి మరణశిక్షను కాస్త మళ్లీ జీవిత ఖైదుగా తగ్గించింది. అందుకే సుప్రీంకోర్టు క్షమించే గుణానికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందే’ అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు.

**విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్?ను పెంచాలి : సుప్రీంకోర్టు**

మరోవైపు, దిల్లీ–ఎన్‌సీఆర్‌లో ఇటీవల కాలంలో జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధాని దిల్లీలో నేరాలను గుర్తించడం, నివారించే అవసరాన్ని వివరించింది. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని దిల్లీ పోలీసులు, రవాణా శాఖ, స్థానిక పరిపాలన యంత్రాంగానికి ఆదేశించింది. అలాగే ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లు, సహాయకులను కఠినంగా తనిఖీ చేయాలని సూచించింది. అవసరమైన అనుమతులు లేకుండా పనిచేస్తున్న అనధికార మద్యం దుకాణాలు, సంస్థలను గుర్తించి చట్ట ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది.

**‘గుండాల గుండెల్లో వణుకు పుట్టాలి’**

కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా మహిళలపై నేరాలకు సంబంధించి ఇటీవలే దేశ అత్యున్నత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ముఖ్యంగా దిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదనే భావన ఉందని పేర్కొంది. దిల్లీలో అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి కఠినమైన చర్యలు, మరింత పటిష్టమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని దిల్లీ పోలీసులను కోరింది. మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తులను నిరోధించడానికి దిల్లీలో మరింత కఠినమైన, పటిష్టమైన పోలీస్ వ్యూహం అవసరమని స్పష్టం చేసింది. దేశ రాజధాని నగరమైన దిల్లీలో నేరాలను అరికట్టడం అత్యవసరమని చెప్పింది. క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని, నేరాలకు పాల్పడటానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భావన నేరస్థుల్లో కలిగించాలని సూచించింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137